RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్

ప్రజల గొంతుక - నిజం కోసం..

ఆఫ్ ప్రజలు



మైలేజ్ కోసం కవిత ఆరాటం

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | బుధవారం, జూలై 1, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 70 | పేజీలు: 8 | వెల : రూ.1

# కేబినెట్ ఫైట్...

## శాఖల మార్పులు తప్పవా



న్యూఢిల్లీ,జూన్ 30 ( వాయిస్ టుడే) : తెలంగాణకు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు, ప్రస్తుతం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కు పదవీ గండం తొలగిపోయినట్టేనని జాతీయ మీడియా సహా.. బీజేపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కేంద్ర మంత్రివర్గ ప్రక్షాళనకు సమయం ఆసన్నమైందని బీజేపీ సీనియర్లు చెబుతున్నారు. ఈ నెలలోనే అంటే.. కొద్ది రోజుల్లోనే ప్రక్షాళన చేయనున్నారని అంటున్నారు. అయితే ప్రస్తుతం .. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన సోమవారం నాటికి వచ్చే అవకాశం ఉంది. ఆయన రాగానే అదే రోజు లేదా ఈ నెల 30 నాటికి మంత్రి వర్గ మార్పు ఉంటుందని జాతీయ మీడియా వర్గాల్లో చర్చ సాగుతోం ది.ఇటీవలే ప్రధాని మోడీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి వర్గ ప్రక్షాళనపైనే ఆమెతో చర్చించినట్టు కూడా వార్తలు రాగా.. తాజాగా మరో విషయం వెలుగు చూసింది. మంత్రుల కూర్పుపై పలు పేర్లతో కూడిన జాబితాను కూడా రాష్ట్రపతికి ప్రధాని అందించారని జాతీయ మీడియా తెలిపింది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ చోటు ఏమాత్రం చెదిరిపోదన్న వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఇటీవల బండి భగీరథ్ వ్యవహారం తెరమీదికి వచ్చిన తర్వాత.. కేంద్ర మంత్రిగా సంజయ్‌ను తప్పిస్తారన్న చర్చ సాగింది.కానీ, ఈ విషయంలో బండి ప్రమేయం లేదని.. ఆయన పార్టీకి చేసిన సేవల నేపథ్యంలోనే పదవి లభించిందన్న

- మిగతా 2వ పేజీలో



# బుల్లెట్ ట్రైన్ సర్వే షురూ..

హైదరాబాద్, జూన్ 20, ( వాయిస్ టుడే ) : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు బుల్లెట్ రైలు కారిడార్ల ప్రాజెక్టులో కీలక అడుగు పడింది. నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ పర్యవేక్షణలో తెలంగాణలోని రంగారెడ్డి, నల్గొండ, వికారాబాద్ జిల్లాల పరిధిలో క్షేత్రస్థాయి (గ్రౌండ్) సర్వే ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఈ కారిడార్ల మార్గాన్ని ఖరారు చేసేందుకు సర్వే బృందాలు క్లిష్టమైన కసరత్తును నిర్వహిస్తున్నాయి.ఈ సర్వేలో భాగంగా రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని కురుమిద్ద, మేడిపల్లి, మంకీస్‌గూడెం, చింతపట్ల వంటి పలు గ్రామాల్లోని పొలాలు, ఖాళీ స్థలాలలో ఎరుపు, తెలుపు రంగులతో ప్రత్యేక మార్కింగ్‌ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. హైదరాబాద్-చెన్నై కారిడార్ శంషాబాద్,

- మిగతా 2వ పేజీలో



# సునీల్ భారతి మిట్టల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ

## తెలంగాణలో పెట్టుబడులు, డేటా సెంటర్లు, విద్యా సంస్కరణలపై చర్చ

హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధీ పెవిలియన్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త, భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిట్టల్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశ్రామిక పెట్టుబడులకు అనుకూల వాతావరణం, విద్యా రంగంలో అమలు చేస్తున్న సంస్కరణల గురించి ముఖ్యమంత్రి వివరించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరిస్తూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాలు అందించేందుకు ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ గురించి సీఎం వివరించారు. అలాగే ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా (ఏటీసీలు) మార్చిన విషయాన్ని, పాలిటెక్నిక్ కళాశాలల ఆధునికీకరణ కార్యక్రమాలను కూడా

- మిగతా 2వ పేజీలో



వాయిస్ ఆఫ్ ప్రజలు

బుధవారం, జూలై 1, 2026

# కేబినెట్ ఫైట్...



వాదన ఉంది. పైగా.. పార్టీకి కుటుంబ వ్యవహారాలకు కూడా సంబంధం లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ సీటు విషయంలో ఎలాంటి మార్పులు ఉండవని తెలుస్తోంది. ఇక, రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి మొత్తం ఐదుగురు మంత్రులు ఉండగా.. బండి సంజయ్‌ను అలానే కొనసాగించినా.. మిగిలిన నలుగురి విషయంలో మార్పులు ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్‌నాయుడును పర్యాటక శాఖ మంత్రిగా(ఇండిపెండెంట్ )గా పంపించే అవకాశం ఉందని గట్టిగా చెబుతున్నారు.ఇక, తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డిని పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పంపించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం కిషన్ రెడ్డి గనుల శాఖ మంత్రిగా ఉన్నారు. అలానే.. గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విషయంలోనూ మార్పు ఉండే అవకాశం ఉందని.. ఆయనను కూడాహోం శాఖ పరిధిలోకి తీసుకుంటారని అంటున్నారు. ఇక, బీజేపీ నాయకుడు, నరసాపురం ఎంపీ శ్రీనివాస వర్మ.. ప్రస్తుతం కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఆయనను కూడా మార్పు చేసి.. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సహాయ మంత్రిగా పంపించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా ఈ మార్పులు చేర్పులు ఉండడం మినహా మంత్రులను తప్పించే అవకాశం లేదని సమాచారం.

**నిర్మలమ్మ స్థానంలో శక్తికాంత్ దాస్**

కేంద్ర మంత్రివర్గంలో ప్రక్షాళన ఖాయమనే వార్తలు వస్తున్న నేపథ్యంలో కీలకమైన ఆర్థిక శాఖ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. దాదాపు 10 సంవత్సరాలుగా ఈ శాఖకు మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్‌ను తప్పించడం ఖాయమని ఢిల్లీ వర్గాలు సహా.. బీజేపీ పెద్దలు కూడా చూచాయగా చెబుతున్నారు. అంతేకాదు.. ఆమె స్థానంలో ఆర్ బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌కు పగ్గాలు అప్పగిస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సమయంలో శక్తికాంత దాస్.. చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఇది ఇప్పుడు ఆయనకు కలిసి వస్తుందని అంటున్నారు.గత 10 సంవత్సరాలకు పైగానే కేంద్ర ఆర్థిక మంత్రిగా అపర చాణిక్యురాలిగా పేరొందిన నిర్మలా సీతారామన్‌ను మార్చడానికి పలు కారణాలు ఉన్నాయని జాతీయ మీడియా పేర్కొంది. గత రెండేళ్లుగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతోపాటు.. ఆర్థిక కార్యకలాపాలపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న దరిమిలా.. త్వరలోనే జరగనున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వ్యవహారం కూడా దీనికి లింకుగా ఉందని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రజల ఆగ్రహాన్ని తగ్గించేందుకు.. దేశంలో ఆర్థిక సమస్యలు తగ్గించి.. కార్యకలాపాలను గాడిలో పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని జాతీయ మీడియా పేర్కొంటోంది.డాలర్‌తో పోలిస్తే.. గత రెండేళ్లుగా రూపాయి మారకం విలువ పడిపోతోంది. అదేసమయంలో స్టాక్ మార్కెట్లలో భారీ నష్టాలు.. దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలు మందగించడం.. మరోవైపు పొంచి ఉన్న ద్రవ్యోల్బణ ముప్పు వంటి వాటిని సమర్థవంతంగా నిర్మలమ్మ ఎదుర్కొనలేక పోతున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆమెను తప్పించడం ఖాయమని చెబుతున్నారు. అయితే.. పూర్తిస్థాయిలో ఆమెను మంత్రివర్గం నుంచి తప్పించకుండా.. శాఖను మాత్రమే మార్పు చేసే అవకాశం ఉందని పెద్ద ఎత్తున బీజేపీ నాయకుల మధ్య కూడా చర్చ సాగుతోంది.ఇక, శక్తికాంత దాస్ విషయానికి వస్తే.. ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన కరోనా వంటి కీలక సమయంలోనూ ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసే చర్యలు చేపట్టారు. ప్రపంచ స్థాయిలో ఆర్థిక స్థితి మందగమనంలో ఉన్నప్పుడు కూడా భారత్ తనను తాను నిలబెట్టుకు నేలా ఆయన వ్యూహాత్మకంగా ముందుకు సాగారు. ఆర్థిక రిజర్వ్‌లు తగ్గిపోకుండా చూశారు. ఇవన్నీ భవిష్యత్తులో దేశాన్ని మరోసారి నిలబెట్టే అవకాశం ఉంటుందన్న చర్చ సాగుతోంది. కాగా.. ప్రస్తుతం శక్తికాంతదాస్ పార్లమెంటుకు ఏ సభ నుంచి కూడా ప్రాతినిధ్యం వహించడం లేదు. అయినప్పటికీ.. ఆయనను మంత్రిగా తీసుకుని.. తర్వాత రాజ్యసభకు ప్రమోట్ చేయించే అవకాశం ఉందని అంటున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# బుల్లెట్ ట్రైన్ సర్వే షురూ..

యాచారం మీదుగా నల్గొండ జిల్లా నాంపల్లి వైపు, అలాగే హైదరాబాద్–బెంగళూరు కారిడార్ శంషాబాద్, షాబాద్ మండలాల మీదుగా సాగేలా ప్రాథమిక ప్రణాళికలు సిద్ధం చేశారు.ఇప్పటికే ఈ హైస్పీడ్ రైలు మార్గాలకు సంబంధించి ఏరియల్ సర్వే విజయవంతంగా ముగిసింది. ప్రస్తుతం జరుగుతున్న క్షేత్రస్థాయి గ్రౌండ్ సర్వే పూర్తిగా పూర్తయితే, ప్రాజెక్టుకు సంబంధించిన తుది ఎలైన్‌మెంట్, బుల్లెట్ రైలు స్టేషన్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే లొకేషన్లు, భవిష్యత్తులో అవసరమయ్యే భూసేకరణ పరిధిపై పూర్తి స్పష్టత రానుంది. ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు నగరాలకు ప్రయాణ సమయం కేవలం 2 నుండి 3 గంటలకు తగ్గిపోనుంది.

# సునీల్ భారతి మిట్టల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ

ప్రస్తావించారు. చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణలో మరింత భారీ స్థాయిలో సమగ్ర డేటా సెంటర్‌తో పాటు కృత్రిమ మేధస్సు (ఏఐ) మౌలిక సదుపాయాల క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సునీల్ మిట్టల్‌ను కోరారు. హైదరాబాద్‌ను డిజిటల్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధస్సు కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్ పెట్టుబడులు, పరిశ్రమల అవసరాలపై తెలంగాణ ప్రభుత్వంతో సమన్వయం కోసం భారతీ గ్రూప్ తరఫున ఒక సీనియర్ అధికారిని నియమించాలని కోరారు. ఈ సందర్భంగా సునీల్ భారతి మిట్టల్ మాట్లాడుతూ, భారతీ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఏటీసీల్లో చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు తెలిపారు. అలాగే ఎయిర్‌టెల్ సంస్థకు రెండో ప్రధాన కార్యాలయంగా హైదరాబాద్‌ను పరిగణిస్తున్నామని వెల్లడించారు. డేటా సెంటర్ల సామర్థ్యాన్ని మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని, తెలంగాణలో ఫైబర్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మిట్టల్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు కూడా పాల్గొన్నారు. తెలంగాణలో పెట్టుబడులు, సాంకేతిక రంగ అభివృద్ధి, విద్యా సంస్కరణలపై ఈ భేటీ సానుకూల చర్చలకు వేదికగా నిలిచింది.

## ప్రజాప్రతినిధుల కోర్టులో బండి సంజయ్‌కి ఊరట

**హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో బండి సంజయ్‌పై కేసు నమోదు**

**అధికార బీఆర్ఎస్ పార్టీ ఓటుకు రూ.25 వేలు పంచుతోందని ఆరోపించిన సంజయ్**

**ఈ వ్యాఖ్యలపై కేసు నమోదు చేసిన హుజూరాబాద్ పోలీసులు**



హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన ఒక పాత కేసులో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నుంచి పెద్ద ఊరట లభించింది. సుదీర్ఘ విచారణ అనంతరం ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది. అసలు విషయానికి వస్తే... హుజూరాబాద్ ఉప ఎన్నిక ప్రచార సమయంలో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీ ఓటుకు ఏకంగా రూ.25 వేల వరకు పంచుతోందని, అందులో ఓటర్లకు కేవలం రూ.5 వేలు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలే నొక్కేస్తున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ విమర్శలపై అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న హుజూరాబాద్ పోలీసులు.. బండి సంజయ్‌పై పలు కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అయితే, తాజాగా ఈ వ్యవహారాన్ని పరిశీలించిన ప్రత్యేక కోర్టు.. ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

# రంగంలోకి సీఎం టీమ్

హైదరాబాద్, జూన్ 30 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు ముగుస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చ నడుస్తోంది. ప్రజా పరిపాలనపై ప్రజల అసలు అభిప్రాయం ఏంటి? క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ప్రతిష్ట ఎలా ఉందనే అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఆరా తీస్తున్నారు. ఇంటెలిజెన్స్, థర్డ్ పార్టీ నివేదికలను పక్కన పెట్టి, కేవలం తన సొంత నమ్మకస్థులతో కూడిన 'సీఎం టీమ్'ను రేవంత్ రెడ్డి రంగంలోకి దింపడం ఇప్పుడు పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.ప్రభుత్వ వ్యతిరేకత రాకముందే అప్రమత్తమవ్వడం, లోపాలను సరిదిద్దుకుంటూ ఎన్నికల మూడ్‌ను ఇప్పటి నుంచే సెట్ చేయడమే లక్ష్యంగా సీఎం స్వయంగా ఈ సర్వే ప్రక్రియను మానిటరింగ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రత్యేక సర్వేను సీఎం టీమ్ తొలుత మంత్రుల నియోజకవర్గాల్లో ప్రారంభించనుంది. ఆ తర్వాతే మిగతా అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారు. కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు విపక్షాల చేతిలో ఉన్న నియోజకవర్గాల్లోనూ ఈ టీమ్స్ పర్యటించనున్నాయి. ప్రభుత్వ ఆరు గ్యారెంటీలు, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి ఎంతవరకు వెళ్లాయి? స్థానిక ప్రజలకు, పార్టీ క్యాడర్‌కు మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంతవరకు అందుబాటులో ఉంటున్నారు? నియోజకవర్గాల్లో పార్టీ పట్టు ఎలా ఉంది? ఎమ్మెల్యేల గ్రాఫ్ ఎలా ఉంది? ఎక్కడెక్కడ అసంతృప్తి వ్యూహాలు నడుస్తున్నాయి? అనే విషయాలను సీఎం అత్యంత రహస్యంగా క్రోడీకరిస్తున్నారు.ఈ సర్వే ద్వారా వచ్చే డేటాను కేవలం నివేదికలకే పరిమితం చేయకుండా, ఒక పక్కా యాక్షన్ ప్లాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి సిద్ధం చేస్తున్నారు. సర్వే విశ్లేషణ ఆధారంగా పార్టీ పరంగా, ప్రభుత్వ అభివృద్ధి పరంగా వెనుకబడిన జిల్లాలను ప్రత్యేకంగా ఫిల్టర్ చేయనున్నారు. ఆయా జిల్లాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో పాటు, ఇన్–ఛార్జ్ మంత్రులను అలర్ట్ చేసి క్యాడర్‌లో నూతనోత్తేజం నింపేందుకు సీఎం కార్యాచరణ రూపొందిస్తున్నారు. మరోవైపు, ప్రజాక్షేత్రంలో పట్టు కోల్పోతున్న ప్రజాప్రతినిధులకు తమ పనితీరు మార్చుకోవాలని గట్టి హెచ్చరికలు జారీ చేసేందుకు కూడా వెనుకాడబోరని గాంధీ భవన్ వర్గాలు పేర్కొంటున్నాయి.ఇప్పటికే ప్రభుత్వం పనితీరు, నెరవేరని హామీలపై సునీల్ కనుగోలు టీమ్ ఉమ్మడి పది జిల్లాల్లో సర్వే చేసి సీఎంకు కీలక రిపోర్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నివేదికలో కొన్ని ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. కొన్ని జిల్లాల్లో బీఆర్ఎస్, మరికొన్ని జిల్లాల్లో బీజేపీ కాంగ్రెస్‌కు గట్టి ఫైట్ ఇవ్వనున్నట్లు అంచనా వేశారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ కంటే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మెరుగ్గా ఉన్నాయని ఈ రిపోర్ట్ తేల్చినట్లు సమాచారం. దీంతో పార్టీ ఓటు బ్యాంకును కాంగ్రెస్ వైపు ఎలా మళ్లించాలనే దానిపై ప్రభుత్వ పెద్దలు కసరత్తులు ప్రారంభించారు. బీజేపీ ఓటు బ్యాంకు బీఆర్ఎస్‌కు, బీఆర్ఎస్ ఓటు బ్యాంకు బీజేపీకి షిఫ్ట్ కాకుండా ఉంటేనే కాంగ్రెస్‌కు పూర్తి లాభం జరుగుతుందని సునీల్ టీం సూచించినట్లు సమాచారం. ఇకపై ప్రతి ఆరు నెలలకోసారి తమ టీమ్ సర్వే చేసి ప్రభుత్వానికి రిపోర్టు ఇస్తుందని సునీల్ టీమ్ హామీ ఇచ్చింది. అంతేకాకుండా, పార్టీ సోషల్ మీడియా టీమ్‌లను హ్యాండిల్ చేసేందుకు కూడా ఈ టీమ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.మిగతా రాష్ట్రాల్లో అధికార పార్టీలు ఎదుర్కొన్న చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటి నుంచే క్షేత్రస్థాయి వ్యూహాలకు పదును పెడుతున్నారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ మార్క్ పాలనను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, వచ్చే ఎన్నికల నాటికి తిరుగులేని శక్తిగా ఎదగడానికి సీఎం వేసిన ఈ 'సర్వే వ్యూహం' రాష్ట్ర రాజకీయాల్లో ఏ రకమైన మార్పులు తీసుకువస్తుందో చూడాలి.

# మైలేజ్ కోసం కవిత ఆరాటం...



హైదరాబాద్, జూన్ 30 : తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు ఊపందుకుంటున్నాయి. బీఆర్ఎస్ నుంచి బహిష్కరణకు గురైన తర్వాత, కల్వకుంట్ల కవిత తెలంగాణ రక్షణ సేన పేరిట సరికొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే, పార్టీని ప్రకటించినప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రజాదరణ లభించకపోవడం, క్యాడర్ ఆశించిన మేర యాక్టివ్ కాకపోవడంతో కవిత తన రాజకీయ వ్యూహాన్ని మార్చినట్లు కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఆమె టార్గెట్ చేయడం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.ఏదైనా కొత్త పార్టీ ప్రాంతీయంగా నిలదొక్కుకోవాలంటే బలమైన లీడ్ లేదా సంచలనాల అవసరం ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్యే ప్రధాన రాజకీయం నడుస్తోంది. ఈ తరుణంలో తన ఉనికిని చాటుకోవడానికి, నిరంతరం వార్తల్లో నిలిచేందుకు కవిత సరికొత్త పంథాను ఎంచుకున్నట్లు అర్థమవుతోంది. అందులో భాగమే పవన్ కల్యాణ్ లక్ష్యంగా సాగుతున్న విమర్శలు.పవన్ కల్యాణ్ కేవలం ఒక రాజకీయ నాయకుడే కాదు, తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన మాస్ ఫాలోయింగ్ ఉన్న స్టార్ హీరో. ఆయన్ను విమర్శిస్తే సహజంగానే అటు అభిమానులు, ఇటు జనసైనికులు సోషల్ మీడియా వేదికగానో, క్షేత్రస్థాయిలోనో గట్టిగా కౌంటర్ ఇస్తారు. ఈ వివాదం ద్వారా తన కొత్త పార్టీ 'టీఆర్ఎస్' పేరు జనంలోకి వెళుతుందనేది కవిత ఆలోచనగా రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.కొద్ది రోజులుగా పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి కవిత చేస్తున్న వ్యాఖ్యలు ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. పవన్ కల్యాణ్ తెలంగాణలో రాజకీయాలు చేయాలని చూస్తే ఊరుకునేది లేదని, ఇక్కడికి వస్తే తరిమికొడతామని కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన సినిమాలు చూసి ఆనందిస్తాం కానీ, రాజకీయంగా ఇక్కడ జోక్యం చేసుకుంటే సహించబోమంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తాజాగా ఇడుపు కాయితం సినిమా చుట్టూ జరుగుతున్న వివాదంలోకి కూడా పవన్ కల్యాణ్‌ను అనవసరంగా లాగడం చర్చనీయాంశమైంది. ఆ సినిమా వివాదం వెనుక ఉన్న అర్థం, పరమార్థం పవన్ కల్యాణ్‌కు బాగా తెలుసంటూ కవిత చేసిన కామెంట్స్, ఆమె కావాలనే వివాదాన్ని పెద్దది చేయాలని చూస్తున్నారనే వాదనకు తావిస్తోంది.రాజకీయాల్లో నెగెటివ్ పబ్లిసిటీ అయినా ఒక్కోసారి మైలేజ్ ఇస్తుందనేది కొందరి నమ్మకం. పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేయడం ద్వారా కవితకు వచ్చే లాభనష్టాలపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. పవన్ అభిమానులు ఇచ్చే కౌంటర్ల వల్ల మీడియాలో, సోషల్ మీడియాలో కవిత పేరు, ఆమె కొత్త పార్టీ పేరు మార్మోగుతుంది. తద్వారా తక్కువ సమయంలోనే ఎక్కువ మందికి పార్టీ రీచ్ అవుతుంది. అయితే వ్యక్తిగత విమర్శలు, పొరుగు రాష్ట్ర నాయకుడిని టార్గెట్ చేయడం వల్ల ప్రజల్లో సీరియస్‌నెస్ తగ్గే ప్రమాదం ఉంది. తెలంగాణ సెంటిమెంట్‌ను రగిల్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, పవన్ కల్యాణ్‌కు తెలంగాణలోనూ పెద్ద సంఖ్యలో అభిమానులు ఉండటం కవితకు మైనస్ కావచ్చు.మొత్తానికి, 'తెలంగాణ రక్షణ సేన'కు ఆశించినంత స్పందన రాకపోవడంతో, పవన్ కల్యాణ్ లాంటి పాపులర్ లీడర్‌ను ఢీకొట్టడం ద్వారా పొలిటికల్ మైలేజ్ సాధించాలనే కవిత వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. మరి ఈ పవన్ కల్యాణ్ అస్త్రం కవిత కొత్త పార్టీకి ఎంతవరకు ఊపిరి పోస్తుందో, ఎలాంటి రాజకీయ లబ్ధిని చేకూరుస్తుందో వేచి చూడాలి.

# గ్రేటర్‌లో గులాబీ రివర్స్ స్కెచ్




హైదరాబాద్, జూన్ 30 : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ – జీహెచ్ఎంసీ పరిధిలో ఎలాగైనా సరే మళ్లీ పాగా వేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ గట్టిగా ట్రై చేస్తోంది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సరికొత్త వ్యూహాలతో దూసుకుపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత దాదాపు రెండేళ్లపాటు పెద్దగా జనంలోకి రాని గులాబీ శ్రేణులు.. ఇప్పుడు మాత్రం రూట్ మార్చాయి. రోజువారీగా ప్రజల్లో ఉంటూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగారు. గ్రేటర్ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ, నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ కేడర్‌లో కొత్త జోష్ నింపుతున్నారు.బీఆర్ఎస్ అగ్రనాయకత్వం జీహెచ్ఎంసీపై ఇంతలా ప్రత్యేక దృష్టి పెట్టడం వెనుక బలమైన రాజకీయ లెక్కలు ఉన్నాయి. హైదరాబాద్ మహానగర పరిధిలోనే ఏకంగా 24 అసెంబ్లీ నియోజకవర్గాలు విస్తరించి ఉన్నాయి. దీనికి ఆనుకుని ఉన్న శివారు నియోజకవర్గాలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య దాదాపు 35 కి చేరుకుంటుంది. అంటే, రాష్ట్ర అధికార పీఠాన్ని శాసించడంలో దాదాపు మూడో వంతు బలం ఒక్క గ్రేటర్ పరిధిలోనే దాగి ఉందన్నమాట.అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచినా, హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లో మాత్రం బీఆర్ఎస్ తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించింది. అదే ఊపును రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లోనూ కొనసాగించి, ఇక్కడ అధికార కాంగ్రెస్ పార్టీని గనుక మట్టికరిపించగలిగితే.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం నల్లేరుపై నడకే అని బీఆర్ఎస్ గట్టిగా భావిస్తోంది. ఇక్కడ సాధించే విజయం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి గట్టి పునాది వేయవచ్చనేది కేటీఆర్ మాస్టర్ ప్లాన్‌గా కనిపిస్తోంది.గత కొన్ని రోజులుగా కేటీఆర్ హైదరాబాద్‌లోని దాదాపు అన్ని నియోజకవర్గాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. కేవలం పార్టీ కార్యాలయాలకే పరిమితం కాకుండా, నేరుగా నియో జకవర్గాల వారీగా పర్యటిస్తూ స్థానిక లీడర్లతో ముఖాముఖి సమావేశాలు నిర్వహి స్తున్నారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ.. ఎన్నికల సమరానికి క్యాడర్‌ను సమా యత్తం చేస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గ స్థాయి సమీక్షల్లో అటు స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూనే, ఇటు రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు.ముఖ్యంగా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన ా×=పై పార్టీ శ్రేణులకు, ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను జనంలోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిస్తున్నారు.అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కొంతకాలం స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్ క్యాడర్.. కేటీఆర్ దూకుడుతో ఇప్పుడు రూట్ మార్చింది. దాదాపు రెండేళ్ల గ్యాప్ తర్వాత ఇప్పుడు రోజూ జనంలో ఉండేందుకే స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రాధాన్యత ఇస్తున్నారు. గల్లీ గల్లీలో పర్యటిస్తూ, ప్రజా సమస్యలపై గళమెత్తు తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి కేవలం కేసీఆర్ హయాంలోనే సాధ్యమైందనే విషయాన్ని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నగరం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు.మొత్తానికి హైదరాబాద్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వానికి చుక్కలు చూపించేందుకు కేటీఆర్ సిద్ధమయ్యారు. ఒకవైపు 24 నియోజకవర్గాల అండ, మరోవైపు కేటీఆర్ దూకుడుతో గ్రేటర్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఇక్కడ పట్టు నిలుపుకోవడం ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో మళ్లీ బీఆర్ఎస్ హవా సృష్టించాలనే 'రివర్స్ స్కెచ్' ఎంతవరకు సక్సెస్ అవుతుందో చూడాలి. కేటీఆర్ వ్యూహాత్మక కొట్లాట అధికార కాంగ్రెస్ పార్టీకి గ్రేటర్ పరిధిలో ఖచ్చితంగా పెద్ద సవాల్‌గా మారబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# తెలుగు రాష్ట్రాల నుంచి భారత్ గౌరవ్ యాత్రలు

## అయోధ్య--కాశీ, దివ్య దక్షిణ పుణ్యక్షేత్ర దర్శనానికి ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైళ్లు



సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలుగు రాష్ట్రాల భక్తుల కోసం ఐఆర్‌సీటీసీ రెండు ప్రత్యేక భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లను ప్రకటించింది. అయోధ్య--కాశీ పుణ్యక్షేత్ర యాత్ర బైద్యనాథ్ ధామ్, దివ్య దక్షిణ యాత్ర అరుణాచలం మీదుగా ప్రత్యేక యాత్రలను నిర్వహించనుంది. అయోధ్య--కాశీ పుణ్యక్షేత్ర యాత్ర రైలు జూలై 4న మధ్యాహ్నం 2 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరనుంది. ఈ యాత్రలో విష్ణుపద ఆలయం, కాశీ విశ్వనాథ్ ఆలయం, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణ దేవి ఆలయం,గంగా హారతి, రామ జన్మభూమి, హనుమాన్ గఢి, త్రివేణి సంగమం, బైద్యనాథ్ ధామ్ వంటి పుణ్యక్షేత్రాలను సందర్శిస్తుంది. ఈ యాత్ర 9 రాత్రులు--10 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ రైలు తెలంగాణలో సికింద్రాబాద్, చర్లపల్లి,కాజీపేట,వరంగల్, ఖమ్మం, ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ,గుడి వాడ,భీమవరం,తణుకు, నిడదవోలు,రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి,విజయ నగరం స్టేషన్లలో ఎక్కే, దిగే సౌకర్యం కల్పించారు. అలాగే దివ్య దక్షిణ యాత్ర అరుణాచలం ప్రత్యేక రైలు జూలై 20న ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరనుంది. ఈ యాత్రలో అరుణాచలేశ్వర ఆలయం, నటరాజ ఆలయం, శ్రీరంగనాథస్వామి ఆలయం, బృహదీశ్వర ఆలయం, రామనాథస్వామి ఆలయం, మీనాక్షి అమ్మవారి ఆలయం, వివేకానందరాక్ మెమోరియల్, కన్యాకు మారి అమ్మవారి ఆలయం దర్శించే అవకాశం ఉంటుంది. ఈ యాత్ర 8 రాత్రులు--9 రోజుల పాటు సాగుతుంది. ఈ రైలు తెలంగాణలోని సికింద్రాబాద్, జనగాం,కాజీపేట,వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, ఆంధ్ర ప్రదేశ్ లోని మధిర, విజయవాడ, తెనాలి,ఒంగోలు,నెల్లూరు, గూడూరు,రేణిగుంట స్టేషన్లలో ఎక్కేదిగే సౌకర్యం కల్పించారు. ఈ ప్యాకేజీ లో ప్రయాణం, శాకాహార భోజనా లు,ప్రయాణ బీమా, భద్రత, టూర్ ఎస్కార్ట్‌లు,ఐఆర్‌సీటీసీ టూర్ మేనేజర్ల సేవలు కూడా ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఐఆర్ సిటిసి టూరిజం వెబ్‌సైట్‌ను సంద ర్శించాలని అధికారులు సూచించారు.



## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ఐఆర్ ) కార్యక్రమాన్ని పరిశీలించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ జూన్ 30(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 295వ డివిజన్ బౌరంపేట్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (స్పెషల్ ఇంటెన్షవ్ రెవిషన్ - ఎస్ఐఆర్ )ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి బూత్ లెవెల్ అధికారులతో ( బిఎల్ఓ లు) కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా అవసరమైన వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. ప్రజలు బీఎల్‌ఓల ద్వారా అందించే ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా నింపి సమర్పించాలని, ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని పేర్కొన్న ఆయన, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో బతుకమ్మ గ్రౌండ్‌ను పునరుద్ధరించి షెడ్ ఏర్పాటు చేయాలని కోరిన స్థానికులు

### హామీ ఇచ్చిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ జూన్ 30(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేట్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో మహిళలు బతుకమ్మ ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన గ్రౌండ్‌లో పలువురు అనధికారికంగా షెడ్లు నిర్మించి షాపులు నిర్వహిస్తున్న విషయాన్ని స్థానికులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై వెంటనే స్పందించిన కొలన్ హన్మంత్ రెడ్డి సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుని పనులను పూర్తి చేయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, బతుకమ్మ వంటి సాంప్రదాయ వేడుకలు నిర్వహించుకునేందుకు ప్రత్యేకంగా కేటాయించిన స్థలాన్ని తిరిగి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. గ్రౌండ్‌పై ఉన్న ఆక్రమణలను తొలగించి, మహిళలు మరియు స్థానిక ప్రజలకు ఉపయోగపడే విధంగా సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన షెడ్ ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై కూడా స్పందిస్తూ, అవసరమైన చోట్ల విద్యుత్ లైట్లు, స్ట్రీట్ లైట్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం, పారిశుధ్య పనులు, అంతర్గత రహదారుల అభివృద్ధి మరియు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసి దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కాలనీ వాసులు, స్థానిక ముఖ్య నాయకులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావును పరామర్శించిన కీసర గ్రామ పంచాయతీ మాజీ వార్డ్ సభ్యులు తుడుం శ్రీనివాస్



నాగారం, జూన్ 30:-(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు అస్వస్థతకు గురై ఖైరతాబాద్‌లోని ఎఐఎన్యు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కీసర గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు, సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా వి. హనుమంతరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న తుడుం శ్రీనివాస్ , ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెబుతూ, వైద్యులు అందిస్తున్న చికిత్సపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజా జీవితంలో విశేష సేవలందిస్తున్న వి. హనుమంతరావు త్వరగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని తుడుం శ్రీనివాస్ ఆకాంక్షించారు.

## ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకురాలు - మురారి స్మితా కోటేష్ గౌడ్



నాచారం (వాయిస్ టుడే):ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్ అన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం తార్నాక లోని పలు ప్రాంతాల్లో బిఎల్ఓ అఖిల తో కలిసి పర్యటించి ఇంటి ఇంటికి తిరుగుతూ ఎస్ఐర్ కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పిస్తు ఎన్యూమరేషన్ పాత్రలను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు ఉన్నా వెంటనే సరిచేసుకోవాలని పేర్కొన్నారు.



## యూసుఫ్‌గూడలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరణ

జూబ్లీహిల్స్ 30( వాయిస్ టుడే): యూసుఫ్‌గూడలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాధన, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాన్ని గీతా గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకుడు లకావత్ రూప్ సింగ్, జూబ్లీహిల్స్ ఇంచార్జ్ నరేందర్, ఇతర నాయకులు పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# దేశ ఆర్థిక శ్రేయస్సును అందించేది చార్టర్డ్ అకౌంటెంట్లే....

### తెలంగాణ ౘ ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీఏ చంద్రశేఖర్ వేముల



సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): ఆర్థిక శ్రేయస్సును అందిస్తూ చార్టర్డ్ అకౌంటెంట్లు భారతదేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలంగాణ ౘ ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీఏ చంద్రశేఖర్ వేముల తెలిపారు. ఆర్థిక రికార్డులను ఆడిట్ చేయడం, నియంత్రణల అనుగుణ్యతకు హామీ ఇవ్వడం, వ్యూహాత్మక పన్ను, వ్యాపార సలహా సేవలను అందించడం ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని, పారదర్శకతను పాటించాలని కోరారు. హైదరాబాద్, సికింద్రాబాద్, తాజ్ త్రి స్టార్ హోటల్ లో సోమవారం తెలంగాణ ౘ ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుండి దాదాపు 300 మంది చార్టర్డ్ అకౌంటెంట్లు, పన్ను న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఏ చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2026న పూర్తిగా అమల్లోకి వచ్చిన నూతన ఆదాయపు పన్ను చట్టం, 2025పై చార్టర్డ్ అకౌంటెంట్లు తప్పనిసరిగా పట్టు సాధించాలన్నారు. క్లయింట్‌లకు వేగవంతమైన సేవలను అందించడం కోసం, ప్రాక్టీషనర్లు ఆదాయపు పన్ను శాఖ యొక్క కొత్త డిజిటల్ ప్రచార వేదికలైన 'కర్ సాథీ' మరియు 'కర్ సేతు' ఉపయోగించుకోవాలని కోరారు. టాక్స్ బార్ అసోసియేషన్‌ను బలోపేతం చేయడానికి నిరంతర విద్య, పన్ను అధికారులతో వ్యూహాత్మక వాదోపవాదాలు మరియు డిజిటల్ పరివర్తనపై దృష్టి సారించాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆదాయపు పన్ను చెల్లింపులు పెరిగేలా కృషి చేస్తూ దేశ ఆర్థికాభివృద్ధిలో తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సీఏ ఆశిష్ జోషి, కోశాధికారి సోమేశ్వర్ నెమ్మాని, సలహాదారు సీఏ రామ్‌దేవ్ బుటాడా, కంపిటేషన్ కమిటీ చైర్మన్ సీఏ అమృత్ కుమార్ కోటా, ఉపాధ్యక్షులు సీఏ పి.వి. నారాయణరావు, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు సీఏ ప్రవల్లిక వేముల, సిఎ ప్రకాష్ చోకదా, సీఏ వెంకట్ రామ్, సీఏ శైలేంద్ర శర్మ, సిఏలీల కృష్ణ మోహన్, ఎన్.వి. చారి, అజయ్ వాల్వే, ఏపీ దహిమా తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు ఉపయోగించుకోవాలి

### మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్

కుత్బుల్లాపూర్, జూన్ 30(వాయిస్ టుడే): ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు ఉపయోగించుకోవాలని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. మంగళవారం మగ్దమ్ నగర్ లోని ఆయన నివాస కార్యాలయం వద్ద (జి ఎల్ ఆర్ ఏ ఇండియా) వారి ఆధ్వర్యంలో మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి డాక్టర్ల బృందం సమక్షంలో ఉచిత పరీక్షలు, మందుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ జగన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన స్వచ్ఛంద సంస్థ వారికి, మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి డాక్టర్ల బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎక్కువ శాతం నిరుపేదల నివసించే ఇలాంటి బస్తీలలో ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం వలన ఎంతో మందికి ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ సభ్యులు, డాక్టర్ల బృందం మాట్లాడుతూ బిపి, షుగర్, టెస్టులతోపాటు వైరల్ ఫీవర్స్, దగ్గు జ్వరం, కీళ్ల నొప్పులు, గొంతు నొప్పి, తదితర రోగాలకు ఉచిత మందులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ డాక్టర్స్ బృందం. ఐతీ సంజయ్ కుమార్.ఐతీ . సౌజన్య. స్నేహ. శివాని. నాయకులు మాజీ అధ్యక్షులు రుద్రా అశోక్. మల్లేష్ గౌడ్. కొలుకుల జైహింద్. వేణు యాదవ్. పాపిరెడ్డి. సిహెచ్ దాసు. ప్రభాకర్. హనుమంతు. విట్టల్ గౌడ్. రాయి రాజేష్. సునీల్ రెడ్డి సంపత్ రెడ్డి. జై మల్లేష్. సబిత ఉమారాణి సతీష్. తదితరులు పాల్గొన్నారు.



## మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్

కుత్బుల్లాపూర్ జూన్ 30(వాయిస్ టుడే): గాజులరామారం సర్కిల్ పరిధిలోని మహాదేవపురం డివిజన్ (దేవేందర్ నగర్) లో అక్షర జ్యోతి మహిళ సమైక్య ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్గిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని దాంట్లో భాగంగానే చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు, రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు పరుస్తుందని మహిళలకు ఉచిత బస్సు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు మంజూరు మరియు ఇతర అనేక కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుంది అని స్థానిక డ్వాక్రా సంఘాల మహిళలలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అక్షర జ్యోతి మహిళా సమైక్య అధ్యక్షురాలు ఎన్ పూలమ్మ, జ్యోతి, రామలక్ష్మి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు యాం సాగర్, దంపనబోయిన శ్రీనివాస్, శివప్ప, నరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, డాన్ శీను, ఋషి, శ్రీకాంత్ రెడ్డి, భాస్కర్, సాగర్ మరియు కార్యకర్తలు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

కుత్బుల్లాపూర్ జూన్ 30(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ శంభీపూర్ లోని కార్యాలయంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించిన రూ.2,00,000/- విలువ గల 7 చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక గొప్ప భరోసాగా నిలుస్తుంది అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మాదాస్ వెంకటేష్, కొర్ర శంకర్ నాయక్, భరత్ కుమార్, సాయి యాదవ్, వార్డ్ ప్రెసిడెంట్ బి.నవీన్,నాయకులు ఉస్మాన్, శ్రీశైలం యాదవ్, కిషన్, ప్రభాకర్, రాజీ రెడ్డి మరియు స్థానిక నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## యూసుఫ్‌గూడ ఎల్ఎన్ నగర్‌లో ప్రభుత్వ స్థల ఆక్రమణ ఆరోపణలు



జూబ్లీహిల్స్ 30 జూన్ (వాయిస్ టుడే): యూసుఫ్ గూడా పరిధిలోని యూసుఫ్‌గూడ ఎల్ఎన్ నగర్‌లో రెండు బొమ్మల ముందు గల్లీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భవన నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, స్థలంపై సమగ్ర విచారణ జరిపి అక్రమ నిర్మాణం ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
బుధవారం 1 జూలై 2026



## క్రమబద్ధీకరణ ప్రక్రియను రద్దు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

### ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలి

సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు, (RCJL) డిగ్రీ, పాలిటెక్నిక్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను రద్దు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, అలాగే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఓయూ జేఏసీ, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఓయూ జేఏసీ, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భారీ నిరుద్యోగ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జార్జిరెడ్డి పి డి ఎస్ యు నాయకులు డాక్టర్ ఎస్. నాగేశ్వరరావు, ఎన్. సుమంత్, కె. స్వాతి మాట్లాడుతూ క్రమబద్ధీకరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, దీనిపై స్వతంత్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే డీఎస్సీతో పాటు పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి పూర్తి స్థాయి నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నాయకులు వేదాంత్ మౌర్య, రంజిత్ రెడ్డి, విజయ్, చేతన్‌తో పాటు పీడీఎస్‌యూ నాయకులు బాలకృష్ణ, శ్రీను, నూతన్, రమేష్, అజయ్, మనోహర్, దివ్య, ప్రసన్న, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



## మామిడి గుండాల సీలింగ్ భూములకు శాశ్వత పట్టాలు ఇవ్వాలి

### అఖిలపక్ష నేతల డిమాండ్

సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): మామిడి గుండాల ప్రాంతంలోని సీలింగ్ భూములకు ప్రభుత్వం శాశ్వత పట్టా హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ మామిడి గుండాల భూ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇల్లందు తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు, సాగు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు ఆవునూరి మధు తదితరులు మాట్లాడుతూ, మామిడి గుండాల ప్రాంతంలో దశాబ్దాలుగా సాగు చేస్తున్న ఆదివాసీ, గిరిజన రైతుల భూములను యంత్రాలతో ఆక్రమించి కందకాలు తవ్వడం, మొక్కలు నాటడం అన్యాయమని ఆరోపించారు. సీలింగ్ భూములపై వెంటనే సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించి, సాగు చేస్తున్న పేద రైతులకు శాశ్వత పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్య పరిష్కారానికి సంబంధించిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) వివిధ వర్గాలు, తెలంగాణ ప్రజాఫ్రంట్, టీడీపీ, బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్, తుడుందెబ్బ, భూదాన్ కమిటీతో పాటు పలు ప్రజా, కుల సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## మేడిపల్లి శ్రీ సాయి నగర్ కాలనీ నూతన అసోసియేషన్

### అసోసియేషన్ సభ్యులను సన్మానించిన పి.యం.సి 25వ డివిజన్ మాజీ కార్పోరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి



మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్, జూన్ 30 : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని 9 వ డివిజన్ మేడిపల్లి శ్రీ సాయి నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులుగా ప్రభాకర్ చారి,ప్రధాన కార్యదర్శిగా నాగిరెడ్డి,కోశాధికారిగా నిరంజన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఇబ్రహీం, ఉపాధ్యక్షులు సరస్వతి, భాస్కర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరంజీవి, భానుప్రకాష్, ప్రదీప్ మరియు మహిళ అధ్యక్షురాలు లక్ష్మి, సలహాదారులు కళావతి,రాజేశ్వరి లలితా, భారతి గౌరవ అధ్యక్షులు గా సుదర్శన్ రెడ్డి,సునీల్,హరిందర్ యాదవ్, యాదగిరి,గార్లను కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.నూతన అసోసియేషన్ సభ్యులను సన్మానించిన 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, ఈ కార్యక్రమంలొ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మోస్ట్ వాంటెడ్ 'బ్రూస్ లీ' గ్యాంగ్ అరెస్ట్

### కేసు చేదించిన చిలకలగూడ పోలీసులు...

### మూడు రాష్ట్రాల్లో 65 కేసులున్న ప్రధాన నిందితుడి తో పాటు ముగ్గురు అదుపులో...

### నగదు, మొబైల్, స్కూటర్ స్వాధీనం..



సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): హైదరాబాద్ నగరంలో వరుస దోపిడీలు, ఆస్తి నేరాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర మోస్ట్ వాంటెడ్ నేరస్థుడు దార్ల నెహెమ్యా అలియాస్ 'బ్రూస్ లీ' గ్యాంగ్ ను చిలకలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. భోయిగూడ దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు ప్రధాన నిందితుడితో పాటు మరో ఇద్దరు పాత నేరస్థులను అరెస్ట్ చేయగా, చట్టంతో వివాదంలో ఉన్న ఒక బాలుడిని (జజూ) అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు నిందితుల నుంచి రెడ్‌మి మొబైల్ ఫోన్, హోండా యాక్టివా స్కూటర్‌తో పాటు మీర్‌పేట్ దొంగతనానికి సంబంధించిన రూ.2.25 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం, ముషీరాబాద్‌కు చెందిన సి. రాజ్‌కుమార్ ఈ నెల 22న భోయిగూడలోని ఫ్లోరా హోటల్ వద్ద ఉండగా యాక్టివాపై వచ్చిన నలుగురు దుండగులు అతడిని బలవంతంగా పద్మారావునగర్ వైపు తీసుకెళ్లి దాడి చేసి, రెడ్‌మి ా3ఴ మొబైల్ ఫోన్, రూ.6 వేల నగదును దోచుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చిలకలగూడ పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ సహాయంతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు.

ప్రధాన నిందితుడు దార్ల నెహెమ్యా అలియాస్ బ్రూస్ లీ (30)పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో హత్య, హత్యాయత్నం, దోపిడీ, ఇళ్ల చోరీ తదితర మొత్తం 65 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. గతంలో పీడీ యాక్ట్ కింద జైలుకు వెళ్లిన అతడు, చంచల్‌గూడ జైలులోనే ఇతర నేరస్థులను ముఠాగా ఏర్పాటు చేసి, ఇటీవల విడుదలైన తర్వాత దారా అశ్వంత్, నితిన్ ఫ్రాన్సిస్ అలియాస్ బబ్లూ, ఒక బాలుడితో కలిసి వరుస నేరాలకు పాల్పడినట్లు వెల్లడించారు. భోయిగూడ దోపిడీకి ముందు అనంతపురంలో వాచ్‌మన్ పై దాడి చేసి నగదు దోచుకున్నట్లు, అనంతరం అల్వాల్‌లో ఇల్లు పగులగొట్టేందుకు ప్రయత్నించి, మీర్‌పేట్ లో ఒక ఇంట్లో చోరీ చేసి బంగారు ఆభరణాలు, నగదు అపహరించినట్లు విచారణలో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. అరెస్టయిన నిందితులను సికింద్రాబాద్ కోర్టులో హాజరుపరచగా, రిమాండ్ విధించగా, బాల నిందితుడిని జువైనెల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరిచారు.

కేసును ఛేదించడం లో కీలకంగా వ్యవహరించిన చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ వి. రామకృష్ణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎల్. మధుబాబు బృందాన్ని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి ఐపీఎస్, అడిషనల్ డీసీపీ జె. నరసయ్య, ఏసీపీ కె. శశాంక్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా డీసీపీ రక్షిత కృష్ణమూర్తి మాట్లాడుతూ, నగరంలో దోపిడీలు, వ్యవస్థీకృత ఆస్తి నేరాలపై పోలీసులు జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా నేరాలకు పాల్పడే వారిపై నిరంతర నిఘా కొనసాగుతుందని, అవసరమైతే రౌడీషీట్లు తెరవడంతో పాటు పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే డయల్--100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# వ్యవసాయ పరిశోధన - పరిశ్రమల భాగస్వామ్యంతో దేశ ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపు

### కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్...



సికింద్రాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే ప్రతినిధి): వ్యవసాయ పరిశోధన సంస్థలు, పరిశ్రమల మధ్య బలమైన భాగస్వామ్యంతో భారత ఆర్థికాభివృద్ధికి కొత్త దశ ప్రారంభమవుతుందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో వ్యవసాయ వ్యర్థాలను విలువైన ఉత్పత్తులుగా మార్చే సాంకేతికతల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ లోని సీఎస్ఐఆర్--ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్ --ఐఐసీటీ) లో రూ.44.46 కోట్లతో నిర్మించనున్న 200 మంది విద్యార్థుల వసతి గృహ సముదాయానికి ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే అధునాతన ఫ్లోరోకెమికల్స్ పరిశోధనా కేంద్రం, సస్టైనబుల్ ఇంజినీరింగ్ కాంప్లెక్స్, కంటిన్యూయస్ ప్రాసెసింగ్ ప్లాట్‌ఫారం, సిరిపురం హ్యాండ్‌లూమ్ క్లస్టర్ కోసం ఏర్పాటు చేసిన 500 కేఎల్‌డీ వికేంద్రీకృత ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ప్రారంభించి దేశానికి అంకితం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రయోగశాలల్లో జరిగే పరిశోధనలు పరిశ్రమలకు చేరి ఉపాధి, ఆవిష్కరణలు, ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని అన్నారు. వ్యవసాయ అవశేషాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పారిశ్రామిక ఉప ఉత్పత్తులను ఇంధనం, హైడ్రోజన్, అధిక విలువ కలిగిన ఉత్పత్తులుగా మార్చే సాంకేతికతలు రైతులు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు కొత్త అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. ఫ్లోరోకెమికల్స్ పరిశోధనా కేంద్రం ద్వారా ఫార్మాస్యూటికల్స్, అగ్రోకెమికల్స్, ఎలక్ట్రానిక్స్, రక్షణ, అంతరిక్ష రంగాలకు అవసరమైన స్వదేశీ సాంకేతిక సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. అలాగే సిరిపురం హ్యాండ్‌లూమ్ క్లస్టర్ కోసం ఏర్పాటు చేసిన ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పర్యావరణ పరిరక్షణతో పాటు నీటి పునర్వినియోగాన్ని ప్రోత్సహిస్తుందని తెలిపారు. సీఎస్ఐఆర్--ఐఐసీటీలో ఇటీవల సుమారు 90 మంది శాశ్వత ఉద్యోగులను, అందులో 70 మంది శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులను నియమించడం అభినందనీయమని పేర్కొన్నారు. యువ పరిశోధకులకు ప్రపంచ స్థాయి వసతులు కల్పించడంలో భాగంగానే కొత్త హాస్టల్ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐఆర్--ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డి, సీఎస్ఐఆర్--సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె. నందికూరి, డాక్టర్ ప్రకాశ్ కుమార్, సీఎస్ఐఆర్--నీరీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకట మోహన్, సీఎఫ్‌డీఎఫ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఉల్లాస్ కొల్తూర్ - సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# రేపటి మెరుగైన జీవితం కోసమే.. నేటి నైపుణ్యాల శిక్షణ

### దుర్గాబాయి దేశముఖ్ మహిళా సభలో

### ఉచిత శిక్షణా తరగతులు



సికింద్రాబాద్, వాయిస్ టుడే ప్రతినిధి: మహిళలు 21వ శతాబ్దికి తగినట్టుగా తమని తాము తీర్చిదిద్దుకున్నప్పుడే, మహిళాసాధికారత సాధ్యం అవుతుంది. డిజిటల్ యుగంలో మహిళలు తమ ఆర్థిక స్వావలంబన కోసం ా× (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్) ని నేర్చుకొని తీరాల్సిన అవసరం నేటి ప్రపంచంలో నెలకొంది అంటే అతిశయోక్తికాదు . ఈ పరిస్థితులని మహిళలు ఎదుర్కొనేలా, ఉచిత శిక్షణా తరగతులని దుర్గాబాయి దేశముఖ్ మహిళా సభ (ఆంధ్ర మహిళా సభ) - లిటరసీహౌస్ వారు , స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో అందిస్తున్నారు. కేవలం శిక్షణా కార్యక్రమాలకే పరిమితం కాకుండా చక్కని ఉద్యోగావకాశాలనూ ఉచితంగా అందిస్తూ ఉండడం విశేషం. బ్యాంకింగ్ రంగంలో అగ్రగామిగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేపట్టిన ఈ కార్యక్రమం దుర్గాబాయి దేశముఖ్ మహిళా సభ (ఆంధ్ర మహిళా సభ) - లిటరసీహౌస్‌లో విజయవంతంగా నడుస్తోంది. ఇప్పటికే 100 మంది మహిళలకు శిక్షణని పూర్తి చేశారు. వారిలో దాదాపు 40 మంది వివిధ ప్రవేటు రంగ సంస్థల్లో విజయవంతంగా వారి ఉద్యోగ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. మహిళా సాధికారత దిశగా విజయవంతమైన మైలురాళ్ళని అధిగమిస్తున్న ఆ కార్యక్రమ వివరాలు ఇలా ఉన్నాయి.

వెనుకబడిన వర్గాల మహిళలను డిజిటల్ రంగంలో నిపుణులుగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన కార్యక్రమం - ఎస్బిఐఎఫ్ డిజిటల్ మహిళ ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం (Digital Literacy) అనేది విలాసం కాదు, అది ఒక కనీస అవసరం. ముఖ్యంగా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన మహిళలకు ఈ డిజిటల్ నైపుణ్యాలను అందించి, వారిని స్వయం సమృద్ధులుగా మార్చడమే "ఎస్బిఐఎఫ్ డిజిటల్ మహిళ" ప్రాజెక్ట్ యొక్క ముఖ్య ఉద్దేశం. ఇందులో విద్యార్థినులకు కంప్యూటర్ ప్రాథమికాంశాలు, ఇంటర్నెట్ వినియోగం, డిజిటల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ భద్రత మరియు నిత్యావసర సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై సమగ్రమైన శిక్షణను అందిస్తున్నారు. కేవలం సాంకేతిక విద్యే కాకుండా, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పై ప్రత్యేక తరగతులు నిర్వహించడం ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంచే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల ఎటువంటి ముందస్తు సాంకేతిక పరిజ్ఞానం లేని ఎంతోమంది మహిళలు, ఈ శిక్షణ ద్వారా కంప్యూటర్లను అనర్గళంగా నిర్వహించే స్థాయికి ఎదగడమే ఈ ప్రాజెక్ట్ సాధించిన అతిపెద్ద విజయం. మొదటి బ్యాచ్ విజయవంతం కావడం ఈ ప్రాజెక్ట్ యొక్క భవిష్యత్తు విజయాలకు బలమైన పునాది వేసింది.

ఆంధ్రమహిళాసభ ప్రెసిడెంట్ ఉష కాందా మాట్లాడుతూ.. "ఆధునిక యుగంలో నిజమైన మహిళా సాధికారత అనేది సాంకేతిక పరిజ్ఞానం పైనే ఆధారపడి ఉందనీ, డిజిటల్ నైపుణ్యాలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని, స్వయంప్రతిపత్తిని పెంపొందిస్తాయి," అని పేర్కొన్నారు. ఏఎంఎస్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం. లలిత కామేశ్వరి, మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన మహిళల చెంతకు డిజిటల్ విద్యను నేరుగా తీసుకెళ్లేలా ఇటువంటి ప్రభావవంతమైన వేదికను అందించినందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ కు ఆమె తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. లిటరసీ హౌస్ చైర్‌పర్సన్ రమాదేవి ఈ ప్రాజెక్ట్ యొక్క వ్యూహాత్మక విధివిధానాలను వివరించారు. ఎస్‌బీఐ ఫౌండేషన్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (జూ=) కింద అందిస్తున్న ఈ సహకారం మహిళల్లో మార్పుకు శ్రీకారం చుట్టిందని కొనియాడారు. మారుతున్న ఉద్యోగ మార్కెట్‌కు అనుగుణంగా, స్థిరమైన ఉపాధి అవకాశాలను పొందేందుకు అవసరమైన అత్యాధునిక నైపుణ్యాలను రాబోయే రోజుల్లో మరికొంత మంది మహిళలకు అందించడమే తమ లక్ష్యమని ఆమె తెలియజేశారు. "ఎస్బిఐఎఫ్ డిజిటల్ మహిళా" ప్రాజెక్ట్ సాధిస్తున్న విజయవంతమైన పురోగతిని దృష్టిలో ఉంచుకుని, తదుపరి బ్యాచ్‌ల కొరకు అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించినట్లు నిర్వాహకులు, లిటరసీ హౌస్ సెక్రటరీ అండ్ కన్వీనర్ ధరణి కాందా తెలియజేశారు. ఆసక్తి గల మహిళలు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ డిజిటల్ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని, సొంతంగా ఉపాధి పొందాలనుకునే మహిళలు వెంటనే దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె ప్రకటించారు. అడ్మిషన్ల కొరకు ఆంధ్ర మహిళా సభ - లిటరసీ హౌస్ యాజమాన్యాన్ని క్రింది మొబైల్ నంబర్లలో సంప్రదించవచ్చు: 9951210441, 7731931245, 6281139282.

# V5 గ్లోబల్ నౌ యూట్యూబ్ న్యూస్ ఛానల్ ప్రారంభం





హైదరాబాద్, జూన్ 30: ప్రముఖులు, శ్రేయోభిలాషులు మరియు మీడియా ప్రతినిధుల సమక్షంలో హైదరాబాద్, కాచిగూడలో 'ఎ5 గ్లోబల్ నౌ' కొత్త డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. శాసన మండలి సభ్యులు దయానంద్ బొగ్గరపు చేతుల మీదుగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన లాంఛనంగా రిబ్బన్‌ను కత్తిరించి ఛానల్‌ను ప్రారంభించారు. దీనితో డిజిటల్ వార్తల రంగంలో ఎ5 గ్లోబల్ నౌ ప్రస్థానం అధికారికంగా మొదలైంది. ఈ కార్యక్రమం సాంప్రదాయ పద్ధతులతో ప్రారంభమైంది. వేద పండితులు పూజలు నిర్వహించి కొత్త సంస్థకు శ్రేయస్సు, విజయం కలగాలని ఆశీర్వదిస్తూ వేద మంత్రాలను పఠించారు. ఈ కార్యక్రమానికి వి5 గ్లోబల్ నౌ ప్రధాన సంపాదకులు ఎన్. ఆర్. లక్ష్మణ రావు, వ్యవస్థాపకులు నరేందర్ చతుర్వేది ముఖ్య అతిథిగా విచ్చేసి శోభను చేకూర్చారు. ప్రారంభోత్సవ కార్యక్రమాల అనంతరం ఎమ్మెల్సీ దయానంద్ బొగ్గరపు ఛానల్ ప్రారంభ వీడియోను రికార్డ్ చేసి, చిత్రీకరించారు. దీనితో ఛానల్ అధికారికంగా డిజిటల్ రంగంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవస్థాపక బృందాన్ని అభినందించి ఛానల్ విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. వేగంగా మారుతున్న నేటి మీడియా ప్రపంచంలో విశ్వసనీయమైన, బాధ్యతాయుతమైన డిజిటల్ జర్నలిజం యొక్క ప్రాముఖ్యత పెరుగుతోందని ఆయన నొక్కి చెప్పారు. వి5 గ్లోబల్ నౌ ప్రారంభం, యూట్యూబ్ వేదిక ద్వారా ప్రేక్షకులకు సకాలంలో, కచ్చితమైన, ప్రభావవంతమైన వార్తా కవరేజీని అందించాలనే తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. వ్యవస్థాపకులు హాజరైన ప్రముఖులకు, అతిథులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, వీక్షకుల కోసం విశ్వసనీయమైన మరియు చైతన్యవంతమైన వార్తా వేదికను నిర్మించడానికి తమ అంకితభావాన్ని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి దానిని విజయవంతం చేసిన హాజరైన వారందరికీ శ్రేయోభిలాషులకు మరియు మద్దతుదారులకు ధన్యవాదాలు తెలిపారు.



## ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

### రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ

అబిడ్స్ : జూన్ 30 ( వాయిస్ టుడే): అర్చకుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్ అబిడ్స్ బొగ్గులకుంటా లోని తెలంగాణ సారస్వత పరిషత్ ధూప, దీప, నైవేద్య అర్చక సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ , అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దౌలతబాద్ వాసుదేవ శర్మ లతో కలిసి నూతన కార్యవర్గంతో బసవరాజు శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ధూప, దీప, నైవేద్య అర్చకుల కుటుంబానికి రాష్ట్రంలో ఉన్న ప్రధాన దేవాలయాల్లో ఉచితంగా శీఘ్ర దర్శనం చేసుకునేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. అలాగే 10 వేలు ఉన్న వేతనాలను 35 వేలకు పెంచేందుకు బ్రాహ్మణ పరిషత్ తరుపున కృషి చేస్తామన్నారు. హైదరాబాద్ నగరంలో అర్చక భవనం నిర్మాణం కోసం ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఖాళీగా ఉన్న 1056 అర్చకుల పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అర్చకుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి , వారి వేతనాలను పెంచేలా కృషి చేస్తానని ఏలూరి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ , అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరికీర్తి అమరేశ్వర శర్మ కోశాధికారి నందనం హరికిషన్ శర్మ గౌరవ సలహాదారులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ కన్వీనర్ గొడవర్తి చక్రధరాచార్యులు మహిళ కన్వీనర్ విశాలాక్షి నూతన కార్యవర్గ సభ్యులు అన్ని జిల్లాల అధ్యక్షా కార్యదర్శి కోశాధికారులు పలు జిల్లాల నుండి వచ్చిన అర్చకులు పాల్గొన్నారు.

## గీతం విద్యార్థిని నివేదితకు గాంధీ ఫెలోషిప్



పటాన్ చెరు (వాయిస్ టుడే) : ప్రతిష్టాత్మక గాంధీ ఫెలోషిప్ ప్రోగ్రామ్ నకు, గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఎం.ఏ. ఎకనామిక్స్ విద్యార్థిని ఆర్. నివేదిక ఎంపికైంది. ఈ విషయాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ వర్గాలు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించాయి. న్యూఢిల్లీలోని పిరమల్ ఫౌండేషన్ అందించే, జాతీయంగా గుర్తింపు పొందిన నాయకత్వ కార్యక్రమం ఇదని, సామాజిక పరివర్తనకు కట్టుబడి ఉన్న యువతలో మార్పును ప్రోత్సహిస్తుందని వివరించారు.

గాంధీ ఫెలోషిప్ అనేది 23 నెలల పాటు సాగే ఒక పరివర్తనాత్మక నాయకత్వ ప్రయాణమన్నారు. ఇది యువ నాయకులను క్షేత్రస్థాయిలో పనిచేసేలా శక్తివంతం చేయడానికి, భారతదేశం అంతటా ప్రభుత్వ వ్యవస్థలను బలోపేతం చేయడానికి దోహదపడేలా రూపొందించినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమం నాయకత్వ అభివృద్ధి, వ్యక్తిగత ఎదుగుదల, సామాజిక ప్రభావాన్ని ఏకీకృతం చేసే ఒక ప్రత్యేక వేదికను అందిస్తుందన్నారు. ఇది ఫెలోలు సమాజానికి సేవ చేస్తూ, వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరిస్తూ, లోతైన ఆత్మపరిశీలన పొందేందుకు వీలు కల్పిస్తుందని తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక ఫెలోషిప్ నకు నివేదిత ఎంపిక కావడం, సామాజిక మార్పు, సమాజ భాగస్వామ్యం, బాధ్యతాయుతమైన నాయకత్వం పట్ల ఆమెకున్న అంకితభావాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఆమె సాధించిన ఈ విజయం, గీతంలో పెంపొందించిన సానుభూతి, సేవ, శ్రేష్ఠత వంటి విలువలకు నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ అద్భుతమైన విజయం సాధించినందుకు విశ్వవిద్యాలయ నాయకత్వం నివేదితను అభినందించడమే గాక, ఆమె ఈ ఫెలోషిప్ ద్వారా అర్థవంతమైన సేవలు అందిస్తూ, సమర్థవంతమైన నాయకురాలిగా ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తపరిచినట్టు తెలియజేశారు. అభ్యాసం, నాయకత్వం, సమాజ సేవతో కూడిన ఈ స్ఫూర్తిదాయకమైన ప్రయాణంలో నివేదిత మరిన్ని విజయాలు సాధించాలని గీతం నాయకత్వం ఆకాంక్షించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సిగాచీ పరిశ్రమ పేలుడు మృతులకు సంపూర్ణ నష్టపరిహారం చెల్లించాలి

ఏడాది గడిచిన అమలుకు నోచుకోని సీఎం రేవంత్ రెడ్డి కోటి రూపాయల హామీ

పరిశ్రమ యాజమాన్యానికి బంటుగా రాష్ట్ర ప్రభుత్వం..

బాధితులకు నిరంతర సహకారం..

పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

బిపిఎల్ చౌరస్తాలో సిగాచి మృతులకు ఘన నివాళి..



పటాన్ చెరు (వాయిస్ టుడే) : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సిగాచి దుర్ఘటన జరిగి ఏడాది గడిచిన నేటి వరకు మృతుల కుటుంబాలకు పూర్తి నష్టపరిహారం అందించడంలో పరిశ్రమ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యాయని.. ఇది అత్యంత దుర్మార్గమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా దుర్ఘటన స్థలం సాక్షిగా మృతి చెందిన ప్రతి కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం అందిస్తున్నామని ప్రకటించిన.. నేటి వరకు అమలు కాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలతో పాటు బాధితులకు సంపూర్ణ న్యాయం చేయకపోతే భారత రాష్ట్ర సమితి తరపున ప్రజా క్షేత్రంలో నిరంత పోరాటాలు చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. సిగాచి దుర్ఘటన జరిగి నేటితో ఏడాది గడిచిన సందర్భంగా.. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం బిపిఎల్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో..మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. గత సంవత్సరం జూన్ 30వ తేదీన సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంలో ఘటనలో 54 మంది మృతి చెందగా..8 మంది ఆచూకీ తెలియకపోవడంతో పాటు 40 మంది తీవ్రంగా గాయపడి నేటికి నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుమారుడుని కోల్పోయిన తల్లిదండ్రులు.. భర్తను కోల్పోయిన భార్య.. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు బాధలు వర్ణనాతీతమని అన్నారు.

పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగా జరిగిన ఘటనలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి అత్యంత దారుణంగా తయారైందని దుయ్యబట్టారు. ఘటన జరిగిన ఆరు నెలల అనంతరం ఒకరిని మాత్రమే అరెస్టు చేసి యాజమాన్యానికి బంటుగా ప్రభుత్వం మారిందని విమర్శించారు. ప్రమాద స్థలం సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మృతి చెందిన ప్రతి కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయలు ఇస్తామని మీడియా ముఖంగా ప్రకటించి నేటికి ఏడాది గడిచిన అమలు కాకపోవడం ప్రభుత్వ వైఖరికి అద్దం పడుతోందని విమర్శించారు. తమకు న్యాయం చేయాలంటూ బాధితుల కుటుంబాలు ప్రభుత్వ కార్యాలయాలు,. పరిశ్రమ యాజమాన్యాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్న కనికరం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మికుల కోసం పోరాడుతున్న వారిని విమర్శించడం తప్ప బాధితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి రూ.60 లక్షల పరిహారం అందించామని చెబుతున్నది అసత్యమని, సెబీలో రూ.118 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉందని వెల్లడించారని గుర్తుచేశారు. బిఆర్ఎస్ పార్టీ ఒత్తిడి కారణంగానే ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం ఇచ్చిందని, బాధిత కుటుంబాల పట్ల ప్రభుత్వానికి కనికరం లేదని మండిపడ్డారు.

మృతుల కుటుంబాలకు నివాళి అర్పించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకుంటామంటే అనుమతించకపోవడం ప్రభుత్వ దుర్మార్గ వైఖరికి అర్థం పడుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం పూర్తిగా చెల్లించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, జీవితాంతం పెన్షన్ అందించాలని ఎమ్మెల్యే జిఎంఆర్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారత రాష్ట్ర సమితి తరపున నిరంతర పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## రాజ్యాంగం మనకు ఇచ్చిన అమూల్యమైన హక్కు 'ఓటు

### ఎస్ఐఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సింగిరెడ్డి పద్మారెడ్డి

### బోడుప్పల్లో చురుకుగా సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ

బోడుప్పల్, వాయిస్ టుడే న్యూస్,జూన్ 30 : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియ చురుకుగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా భీమ్ రెడ్డి నగర్ కాలనీలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పాల్గొని ప్రజలకు ఎస్ఐఆర్ పై అవగాహన కల్పిస్తూ, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి పద్మా రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఏవైనా మార్పులు ఉంటే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు వెంటనే ఓటును నమోదు చేసుకోవాలని, ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఎప్పటికప్పుడు ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవడం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఓ రాకేష్, శివ శంకర్, వీరస్వామి, కుమార్, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.




## పార్కును కాపాడిన హైడ్రా అధికారులు

బోడుప్పల్, వాయిస్ టుడే న్యూస్ జూన్ 30 : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని టెలిఫోన్ కాలనీలో కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు వారి ఆధీనంలోకి తీసుకొని కంచెను ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. కాలనీ ప్రజల అవసరాల కోసం ఉపయోగించవలసిన పార్కును ప్రజాధనాన్ని కాపాడుతున్న హైడ్రా అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి,జనరల్ సెక్రెటరీ రమేష్ గౌడ్,వీరారెడ్డి శ్రీనివాస్ గౌడ్, వెల్డింగ్ సురేష్, శ్రీనివాస్ రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధికి ప్రతీకలుగా పల్లెలు

### భానూరు, క్యాసారం గ్రామాలలో 30 లక్షల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..

పటాన్ చెరు (వాయిస్ టుడే) : పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలను అభివృద్ధికి ప్రతీకలుగా తీర్చిదిద్దుతున్నామని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరువు మండల పరిధిలోని భానూరు, క్యాసారం గ్రామాల్లో 30 లక్షల రూపాయల జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే నిధులతో పాటు సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి. సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సర్పంచులు శాంతయ్య, గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్, గోపాల్, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిగాచి పరిశ్రమ ప్రమాదానికి ఏడాది

### బాధితులకు న్యాయం ఎక్కడ? : మాద్రి పృథ్వీరాజ్.



పటాన్ చెరు (వాయిస్ టుడే) : సిగాచి పరిశ్రమలో జరిగిన విషాదకర ప్రమాదానికి నేటితో సంవత్సరం పూర్తవుతున్నా, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఈ నేపథ్యంలో ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల జ్ఞాపకార్థం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించాలని నిర్ణయించాం. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి అనుమతి నిరాకరించడం అత్యంత దురదృష్టకరం. ఇది బాధితుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తోంది. అనుమతి నిరాకరించినప్పటికీ, సభా స్థలం సమీపంలో ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించాం. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు మా పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నాం.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
బుధవారం 1 జూలై 2026



## మోడ్యూలస్ కళాశాల ప్రిన్సిపాల్ నాగ రవి జన్మదిన వేడుకలు

కూకట్‌పల్లి, జూన్ 30(వాయిస్ టుడే): కొండాపూర్‌లోని మోడ్యూలస్ కళాశాల ప్రిన్సిపాల్ నాగ రవి జన్మదినాన్ని ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నోముల రవీందర్ గౌడ్ నాగ రవి కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఉన్నత విజయాలు కలగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు సైతం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.



## తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, ఐఏఎస్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన ఉప్పు రామకృష్ణ

కూకట్ పల్లి, జూన్ 30(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, ఐఏఎస్ ని టీడీపీ మూసాపేట్ కంటెస్టెడ్ కార్పొరేటర్ ఉప్పు రామకృష్ణ, సప్పిడి భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి, పలు ప్రజా సంబంధిత అంశాలపై స్నేహపూర్వకంగా చర్చించారు.

## కరెంటు పోతే మూగబోతున్న బిఎస్ఎన్ఎల్ సేవలు

### ఫోన్లు,ఇంటర్నెట్ పనిచేయక తీవ్ర ఇక్కట్లు

కరీంనగర్ రూరల్,జూన్ 30(వాయిస్ టుడే):ఆధునిక ప్రపంచంలో సెల్ ఫోన్లు,ఇంటర్నెట్ తో మానవులకు విడదీయరాని అనుబంధం ఏర్పడింది.వినియోగదారులను ఆకట్టుకోవడానికి ప్రైవేటు టెలిఫోన్ సంస్థలు వివిధ రకాల టారిఫ్ లు,అత్యుత్తమ సేవలు అందిస్తుంటే, ప్రభుత్వ రంగ సంస్థ అయిన బిఎస్ఎన్ఎల్ సేవలు మాత్రం అధ్వాన్నంగా ఉంటున్నాయి. కరీంనగర్ రూరల్ ప్రాంతం ఆసిఫ్ నగర్ బీఎస్ఎన్ఎల్ సేవలు మాత్రం కరెంటు పోతే సెల్ టవర్లు పనిచేయక సెల్ ఫోన్లు మూగబోతున్నాయి. బిఎస్ఎన్ఎల్ సేవలు వాడుతున్న వినియోగదారులు సెల్ ఫోన్లు, ఇంటర్నెట్ పనిచేయక బ్యాంకింగ్ సేవలు,ఇతర ముఖ్యమైన పనులకు తీవ్ర అంతరాయం కలుగుతుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కరెంటు సరఫరా నిలిచిపోయినప్పుడు పవర్ బ్యాక్ అప్ సేవలు అందించి బిఎస్ఎన్ఎల్ సేవలు నిరంతరాయంగా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



## డ్యామ్ కట్టపై చెట్లు, ముళ్లపొదలు తొలగించమని సుడా చైర్మన్‌ను కోరిన వాకర్స్

కరీంనగర్,జూన్ 30(వాయిస్ టుడే): ఎల్ఎండి డ్యామ్ కట్టపై చెట్లు, ముళ్ళపొదలు విరివిగా పెరగడం వల్ల వాకర్స్ కు ఇబ్బందులు కలుగుతున్నాయని పాములు, క్రిమికీటకాలు వస్తున్నాయని ఉదయం వాకింగ్ కు డ్యామ్ కట్టపైకి వెళ్లిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని వాకర్స్ కోరారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం ఇదే విధంగా పెరుగుతే కట్టమొత్తం చెట్లు ముళ్లపొదలు దగ్గరుండి తొలగింపజేశానని త్వరలో మళ్లీ తొలగిస్తామని వాకర్స్ కు హామీ ఇచ్చారు.



## కొత్తపల్లి చేనేత సంఘ విజేతలకు గంగుల అభినందనలు

కరీంనగర్, జూన్ 30(వాయిస్ టుడే): కొత్తపల్లి చేనేత సహకార సంఘ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులైన అభ్యర్థులు ఘన విజయం సాధించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు మాజీ మంత్రి,కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విజేతలకు శాలువాలు కప్పి సన్మానించి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు.చేనేత సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దూస మునీందర్, ఉపాధ్యక్షుడు నడిమెట్ల చంద్రమౌళి, కోశాధికారి సిరిపురం హనుమండ్లు,డైరెక్టర్లు ఎలిగేటి రాజేశం, కోడూరి రాజేశం,బీఆర్ఎస్ నాయకులు జమీల్ ఉద్దీన్,ఎస్కే బాబా, రాంబాబు,శ్రీకాంత్,ఫక్రుద్దీన్, సుధాకర్, కనకరాజు పాల్గొన్నారు.



# లక్ష మంది ఓటర్లతో రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహిస్తాం: డాక్టర్ కొండ దేవయ్య పటేల్

వేములవాడలో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు పటేల్ సంఘం ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల నియామకం

వేములవాడ, జూలై 1: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరి మున్నూరు కాపు సత్రంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు పటేల్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా, నియోజకవర్గ, మండల, మున్సిపల్ డివిజన్ స్థాయి ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల నియామక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్లు, కో-కన్వీనర్లు, కమిటీ సభ్యులకు నియామక పత్రాలను సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ కొండ దేవయ్య పటేల్, తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల, మున్సిపల్ కార్పొరేషన్ వార్డు స్థాయిల నుంచి సుమారు 10 వేల మంది ప్రతినిధులను కన్వీనర్లు, కో-కన్వీనర్లుగా నియమిస్తున్నట్లు తెలిపారు. వారి ద్వారా గ్రామ స్థాయి సంఘాల వివరాలు, సభ్యుల డేటా సేకరించిన అనంతరం ప్రత్యేక ఎన్నికల కమిటీని ఏర్పాటు చేసి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ వ్యాప్తంగా మున్నూరు కాపు సమాజానికి చెందిన సుమారు లక్ష మంది సభ్యులు ఓపెన్ బ్యాలెట్ విధానంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజాస్వామ్యబద్ధంగా రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గానికి ప్రాతినిధ్యం కల్పించే విధంగా పారదర్శక ఎన్నికలు నిర్వహించడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మున్నూరు కాపు సమాజం జనాభా పరంగా





బీసీ వర్గాల్లో ఒకప్పుడు అగ్రస్థానంలో ఉండేదని, అయితే ప్రస్తుతం సామాజిక, రాజకీయ పరంగా వెనుకబడిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా మున్నూరు కాపు సమాజానికి తగిన స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాజకీయ అవకాశాలు అందలేదని అన్నారు. అందుకే "ఒక కులం -- ఒక సంఘం" అనే నినాదంతో తెలంగాణ మున్నూరు కాపు పటేల్ సంఘాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్ర కమిటీ ఏర్పాటైన అనంతరం పటేల్ గెజిట్ సాధన, మున్నూరు కాపుల హక్కుల పరిరక్షణ, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాల విస్తరణ కోసం ఉద్యమాత్మక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు అవసరమైతే ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి హక్కులు సాధించుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూరగాయల కొమురయ్య పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొంచెట్టి శంకర్ పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నామాల పోశెట్టి పటేల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్నికల కమిటీ కన్వీనర్లు, కో-కన్వీనర్లకు నియామక పత్రాలు అందజేశారు.

ఈ సమావేశంలో నంది కిషన్ పటేల్, కొండ నర్సయ్య పటేల్, దుమాల శ్రీనివాస్, గోలి తిరుపతి పటేల్, మెంగాని మనోహర్ పటేల్, మాసం రత్నాకర్ పటేల్, బండారు శ్యామ్ పటేల్, పడిగాల రాజు, జలపతి, కె. బాలరాజు, బాలు, దారం చంద్, గోస్కుల రవి పటేల్, బుచ్చిరాములు తదితర నాయకులతో పాటు 13 మండలాల అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, మున్సిపల్ డివిజన్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, వివిధ కుల సంఘాల నాయకులు, మున్నూరు కాపు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంఘాన్ని మరింత పటిష్టపరిచి, మున్నూరు కాపుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.



## ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యాలను అధిగమించాలి

### నిర్మాణాల వేగం పెంపునకు ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆదేశం

తిమ్మాపూర్, జూన్ 30(వాయిస్ టుడే): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటి పథకం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు వీలుగా నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు,గృహనిర్మాణ సంస్థ అధికారులతో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి,బిల్లుల చెల్లింపులు,ఇళ్ల మంజూరైనప్పటికీ నిర్మాణాలు చేపట్టని వారి వివరాలు, అందుకు గల కారణాలు వంటి తదితర అంశాలపై ఎమ్మెల్యే సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని,ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడమే కాకుండా వాటిని అధిగమించేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఇసుక, సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రి కొరత లేకుండా చూడాలన్నారు.లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో చెల్లించి, నిర్మాణం ఎక్కడా ఆగకుండా చర్యలు తీసుకోవాలి అని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లు,ఇంజనీర్లు సమన్వయంతో పని చేసి,లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.పెండింగ్‌లో ఉన్న ఇళ్లను వెంటనే గ్రౌండింగ్ చేయాలని ఆయన కోరారు. వివిధ స్థాయిలలో ఉన్న ఇళ్లను తదుపరి దశకు తీసుకెళ్లాలేలా చూడాలన్నారు.లబ్ధిదారులకు సాంకేతిక సూచనలు అందించడంతో పాటు నిర్మాణ సామగ్రి లభ్యత,నిధుల విడుదల,పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రతి గ్రామంలో నిర్మాణాల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ నిర్ణీత గడువులోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వీవీ వరలక్ష్మి (మానకొండూర్), పి.అనిత (శంకరపట్నం),ఎన్.ఆర్.మల్హోత్ర (తిమ్మాపూర్), ఏ.శ్రీనివాస్ రెడ్డి (గన్నేరువరం),కె.ప్రవీణ్ (బెజ్జంకి), వై.శశికళ(ఇల్లంతకుంట),హౌసింగ్ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు పి.శ్రీలత, ముజాఫరుద్దీన్,అధికారులు టీఆర్ ప్రవీణ్ కుమార్, ఎస్.వెంకటరమణ, ఏ.కృష్ణప్రసాద్,ఆర్ అజయ్ కుమార్, ఊర్మిళ,ఖాజా ముజహీర్ అలీ,ఏ.మహేందర్ పాల్గొన్నారు.

## బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్‌ను కలిసిన కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్

### కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిపై దిశానిర్దేశం చేసిన పార్టీ నేషనల్ చీఫ్



కరీంనగర్, జూన్ 30(వాయిస్ టుడే): హైదరాబాద్ వేదికగా జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో పాల్గొన్న కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కోలగని శ్రీనివాస్,డిప్యూటీ మేయర్ సునీల్ రావు,బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి లు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకుని, మేయర్ పీఠాన్ని దక్కించుకున్నందుకు నితిన్ నబిన్ మేయర్ కొలగని శ్రీనివాస్,డిప్యూటీ మేయర్ సునీల్ రావులను ప్రత్యేకంగా అభినందించి, శాలువాతో సన్మానించారు.కరీంనగర్ నగరపాలక సంస్థకు మంచి గుర్తింపు తీసుకువచ్చేలా,ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా పనిచేయాలని మేయర్,డిప్యూటీ మేయర్లకు నితిన్ నబిన్ సూచించారు.బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి,బిజెపి రాష్ట్ర పరిశీలకులు సునీల్ బన్సల్ ను మేయర్ కొలగని శ్రీనివాస్,డిప్యూటీ మేయర్ సునీల్ రావు,జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.నగర కార్పొరేషన్ ను బిజెపి కైవసం చేసుకోవడం పట్ల సునీల్ బన్సల్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.మేయర్, డిప్యూటీ మేయర్లను సునీల్ బన్సల్ అభినందించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగని శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ స్వయంగా అభినందించి సన్మానించడం తనకు మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందని,వారి సూచనలను శిరసా వహిస్తామన్నారు.కరీంనగర్ నగరపాలక సంస్థను రాష్ట్రంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దడానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం స్మార్ట్ సిటీ,అర్బన్ డెవలప్మెంట్ నిధులతో నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని,ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా,ప్రతి డివిజన్ సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు సాగుతాం అని మేయర్ కోలగని శ్రీనివాస్ తెలిపారు.

# బావుపేట్ రహదారిపై నాలుగేళ్లుగా నరకయాతన

**కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై టీఆర్‌పీ ఫైర్**

**శాశ్వత పరిష్కారం చూపకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం**

**టిఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా**



కరీంనగర్, జూన్ 30(వాయిస్ టుడే): కొత్తపల్లి మండలం బావుపేట్ గ్రామ ప్రధాన రహదారి గత నాలుగు సంవత్సరాలుగా పూర్తిగా అధ్వాన్నంగా మారి ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు మండిపడ్డారు.గ్రామ ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేస్తూ కొత్తపల్లి మండల అధ్యక్షులు ఓర్సు రాజు ఆధ్వర్యంలో బావుపేట్ గ్రామంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మాట్లాడుతూ నాలుగేళ్లుగా ప్రజలు రోడ్డు కోసం ఎదురుచూస్తున్నా పాలకులు, అధికారులు కనీస బాధ్యత కూడా తీసుకోక పోవడం దురదృష్టకరమన్నారు.వర్షాకాలంలో రహదారి బురదమయంగా మారి విద్యార్థులు, రైతులు, మహిళలు, అత్యవసర సేవలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు.వెంటనే నాణ్యమైన రహదారి నిర్మాణ పనులను ప్రారంభించి గ్రామ ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించే వరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇచ్చిన ప్రజాప్రతినిధులు ఇప్పుడు గ్రామ ప్రజల బాధలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. బావుపేట ప్రజల సహనాన్ని పరీక్షించవద్దని, వెంటనే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలను విస్మరిస్తే మహిళలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా నాయకులు మహబూబ్ అలీ, కొత్తపల్లి మండల అధ్యక్షులు ఓర్సు రాజు,మండల మహిళా అధ్యక్షురాలు ఓర్సు విమల,సోషల్ మీడియా ఇన్‌చార్జ్ దారంగుల గణేష్, నరేష్ మోహన్, మురళి, కార్తీక్, శేఖర్, రాజు, మహేందర్, సంపత్, విజయలక్ష్మి,సిద్ధు,వేణు, గణేష్, శ్రీను,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## అభివృద్ధి, సంక్షేమం - కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: వొడితల ప్రణవ్

**- నిరుపేద లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది.**

**- సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన హుజురాబాద్ ఇంచార్జి ప్రణవ్ బాబు**

**- సంక్షేమ పథకాల విషయంలో పారదర్శకత పాటిస్తున్నాం**

హుజూరాబాద్ జూన్ 30 (వాయిస్ టుడే): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం, కాంగ్రెస్ పాలనలో నిరుపేదలైన లబ్ధిదారులకు సంక్షేమం అభివృద్ధి అందించడమే ఏకైక లక్ష్యమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. మంగళవారం రోజు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 82 మంది లబ్ధిదారులకు 30 లక్షల విలువ చేసే చెక్కులను నేరుగా అందజేశారు. నిరుపేదలు పరిస్థితి బాగోలేక ఆసుపత్రులపాలైన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కుల రూపంలో అండగా ఉంటుందని,ఇప్పటివరకు హుజురాబాద్ లో సుమారు 10కోట్ల రూపాయల చెక్కులు పంపిణీ చేశామని అన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల విషయంలో పారదర్శకత పాటిస్తున్నాం, డబ్బులు అడిగితే సస్పెండ్‌కి వెనకాడం..**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో పారదర్శకతను పాటిస్తున్నామని, త్వరలో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వబోతున్నామని అన్నారు. సంక్షేమ పథకాల విషయంలో ఏవరైనా డబ్బులు అడిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుం టామని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల ప్రజా ప్రజా ప్రతినిధులు, మండలాల అధ్యక్షులు,అనుబంధ సంఘాల నాయకులు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం ఎక్కడ..?

**మూడు బడ్జెట్లు ముగిసినా ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి..?**

**ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

హుజూరాబాద్, జూన్ 30 (వాయిస్ టుడే): హుజురాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్ మండల కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక భరోసా కల్పించిన కల్యాణలక్ష్మి, గర్భిణీలకు అండగా నిలిచిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, రైతులకు రైతుబంధు వంటి సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తుంటే, కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం చెక్కులతో పాటు తులం బంగారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉందని, యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. యూరియా పంపిణీలో యాప్ పేరుతో అమలు చేస్తున్న విధానాలు రైతులకు మరిన్ని ఇబ్బందులు సృష్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కాళేశ్వరం ప్రాజెక్టు అవసరం ఎంత కీలకమో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కాళేశ్వరం ద్వారా నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లు, ప్రాజెక్టులు నింపితే కరువు పరిస్థితులు తలెత్తేవి కాదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి విలువ ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనే ప్రజలకు పూర్తిగా అర్థమవుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా రైతులకు మూడు విడతల రైతుబంధు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో గొప్పగా ప్రకటించిన ఆరు గ్యారంటీలు ఎక్కడ అమలయ్యాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ మరోసారి అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## అనుమతులు లేకుండా నూతన భవనంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి నరసింహ హాస్పిటల్

**డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేసిన డీవైఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ**




కరీంనగర్, జూన్ 30(వాయిస్ టుడే): డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ శ్రీరామ్ కు వినతిపత్రం అందజేసి, కరీంనగర్‌లోని శ్రీలక్ష్మి నరసింహ హాస్పిటల్‌పై సమగ్ర విచారణ చేపట్టి ప్రజల ప్రాణాల రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ పటేల్ మాట్లాడుతూ గతంలో వేరే భవనంలో నిర్వహించబడిన శ్రీలక్ష్మి నరసింహ హాస్పిటల్ ప్రస్తుతం నూతన భవనంలో వైద్య సేవలు నిర్వహిస్తోందని అనుమతులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.నూతన భవనంలో ఇంకా నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలోనే ఓపీ,ఐపీ సేవలు నిర్వహించడం అత్యంత బాధ్యతారాహిత్య చర్య అని అన్నారు.వైద్య సేవలను వ్యాపారంగా మార్చి ప్రజల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని లాభాలు పొందే ధోరణిని ప్రభుత్వం ఉపేక్షించకూడదన్నారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,అగ్నిమాపక శాఖ,మున్సిపల్ శాఖ,కాలుష్య నియంత్రణ బోర్డు తదితర సంబంధిత శాఖలు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి,షిఫ్టింగ్ అనుమతులు,ఫైర్ సేఫ్టీ,బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ,భవన భద్రత,ఇతర చట్టబద్ధ అనుమతులపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి వెల్లడించాలని కోరారు. విచారణలో నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే శ్రీలక్ష్మి నరసింహ హాస్పిటల్ యాజమాన్యంపై సంబంధిత చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి,కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారుఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్,కృష్ణ,రాజ్‌కుమార్,సహాయ కార్యదర్శి అశోక్,అరవింద్,నాయకులు జీవన్,సతీష్ నగేష్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



## డైట్ అధ్యాపకులు ప్రద్యుమ్న సేవలు శ్లాఘనీయం

**పదవీ విరమణ సభలో ఎమ్మెల్యే కవ్వంపల్లి**

తిమ్మాపూర్, జూన్ 30(వాయిస్ టుడే): పదవీ విరమణ పొందిన జిల్లా విద్య, శిక్షణ సంస్థ (డైట్) లెక్చరర్ ప్రద్యుమ్న విద్యారంగానికి అందించిన సేవలు ప్రశంసనీయమని,ఆయన సుదీర్ఘ అనుభవం భావితరాల ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా నిలుస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.ఎల్ఎండీ కాలనీలోని డైట్ లో నిర్వహించిన ప్రద్యుమ్న పదవీ విరమణ వీడ్కోలు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పదవీ విరమణ అనేది ఉద్యోగానికి మాత్రమేనని,సమాజ సేవకు కాదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ప్రద్యుమ్న తన అనుభవాన్ని,విజ్ఞానాన్ని రానున్న రోజుల్లో కూడా విద్యారంగ అభివృద్ధికి వినియోగించాలని ఆకాంక్షించారు.యువ ఉపాధ్యాయులు ఆయన సేవాస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విలువలను కూడా అందించాలని సూచించారు. ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణానికి పునాదిగా నిలుస్తుందని, ఆ బాధ్యతను ప్రద్యుమ్న అంకితభావంతో నిర్వహించారని ఎమ్మెల్యే కొనియాడారు. ఉపాధ్యాయుల శిక్షణలో నాణ్యత పెంపొందించడంతో పాటు విద్యాబోధనలో విలువలు, క్రమశిక్షణకు ఆయన పెద్దపీట వేశారని పేర్కొన్నారు.ప్రద్యుమ్న ఆరోగ్యంగా, ఆనందంగా పదవీ విరమణ జీవితాన్ని గడపాలని ఎమ్మెల్యే ఆకాంక్షిస్తూ,ఆయన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రద్యుమ్నను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు,డైట్ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ప్రజాప్రతినిధులు,శిక్షణార్థులు పాల్గొన్నారు.

## జిల్లా న్యాయస్థానం పర్యవేక్షకుడు వాసం శివ నారాయణ పదవీ విరమణ

కరీంనగర్, జూన్ 30(వాయిస్ టుడే): కరీంనగర్ జిల్లా న్యాయస్థానంలో సీనియర్ పర్యవేక్షకుడిగా పనిచేస్తున్న వాసం శివ నారాయణ పదవి విరమణ ఉత్సవము జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.28 ఏళ్ల సర్వీస్ ఉన్న శివ నారాయణ తెలుగు సారస్వతములో దిట్ట.స్వయంగా పద్యకవి.కరీంనగర్ శరత్ సాహితీ కళా స్రవంతి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సబ్బరి లక్ష్మీనారాయణ, సంకేపల్లి నాగేంద్ర శర్మ,సాహితీవేత్తలు వెలమల జయపాల్ రెడ్డి,మఠ్రిపల్లి మహేందర్ డాక్టర్ సబ్బరి లక్ష్మీనారాయణ సంస్థ తరఫున సన్మాన పత్రము సమర్పించి శాలువాతో సత్కరించారు.ఈ పదవీ విరమణ కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్ న్యాయమూర్తులు ఎస్ . శివకుమార్,అదనపు న్యాయమూర్తి డి .వెంకటేష్,సీనియర్ అడిషనల్ సివిల్ జడ్జి జమాన వెంకట సత్యనారాయణ రాజు కిరణ్ ముఖ్య అతిథులుగా వేదికను అలంకరించారు.జిల్లా న్యాయస్థానం ఉద్యోగుల సంఘం రిటైర్డ్ అవుతున్న శివ నారాయణ దంపతులను శాలు ఘనంగా సత్కరించారు.



# వేములవాడలో వైభవంగా శ్రీ బద్ది పోచమ్మ బోనాల ఉత్సవం

**భక్తులతో స్వయంగా మాట్లాడి, ఇబ్బందులు అడిగి తెలుసుకున్న ఈవో**

వేములవాడ, జూన్ 30(వాయిస్ టుడే): దక్షిణ కాశీగా పేరుగాంచిన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధాలయమైన శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి సన్నిధి భక్తుల జయజయధ్వానాలతో, ఆధ్యాత్మిక కోలాహలంతో మార్మోగింది. సోమవారం నాడు స్వామివారిని దర్శించుకుని పునీతులైన భక్తులు, మంగళవారం తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయానికి పోటెత్తారు. తమ ఇలవేల్పు అయిన బద్ది పోచమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాల మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు సాంప్రదాయబద్ధంగా తలపై బోనాలతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన బోనాలు, పట్నాలు, బెల్లం కళ్ళు, సాక లు, ఓడి బియ్యం, చీరె సారెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ ప్రాంగణమంతా మంగళహారతులు, కర్పూర నీరాజనాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

**క్షేత్రస్థాయిలో ఈవో రమాదేవి పర్యవేక్షణ.. భక్తులకు భరోసా..**



రాష్ట్రం నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు ఆలయ ఈవో (ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) రమాదేవి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. బద్ది పోచమ్మ గుడిలోని క్యూలైన్లు, బోనాల సమర్పణ స్థలాలను నిశితంగా పరిశీలించారు. ఎండ తీవ్రత, రద్దీ దృష్ట్యా భక్తులకు తాగునీరు, నీడ వంటి కనీస వసతుల్లో లోపాలు రాకుండా చూడాలని అక్కడికక్కడే ఆలయ సిబ్బందికి, అర్చకులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రక్షణ, పారదర్శకతను పరిశీలించే క్రమంలో ఈవో క్యూలైన్లలో ఉన్న భక్తుల వద్దకు వెళ్లి, వారు కొనుగోలు చేసిన కల్లు బెల్లం, సాక, పట్నాల టికెట్లను స్వయంగా తనిఖీ చేశారు.

**అవినీతికి తావులేదు..**

**దళారులను నమ్మొద్దు : ఈవో హెచ్చరిక**

భక్తులతో ఈవో రమాదేవి స్వయంగా ముఖాముఖి మాట్లాడారు. "దర్శనంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? కొబ్బరికాయలు కొట్టే స్థలంలో కానీ, బోనాలు-పట్నాలు సమర్పించే చోట కానీ సిబ్బంది ఎవరైనా మిమ్మల్ని అదనంగా డబ్బులు (పైసలు) డిమాండ్ చేస్తున్నారా?" అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఆమె పలు కీలక సూచనలు చేశారు.

**హుండీలోనే కానుకలు :** "భక్తులు ఆలయంలో ఎవరికీ చేతికి రూపాయి కూడా ఇవ్వకూడదు. మీకు తోచిన కానుకలు, ముడుపులు ఏవైనా ఉంటే కేవలం ఆలయ హుండీలోనే వేయాలి."

**రశీదులు తప్పనిసరి :** "దేవస్థాన పూజలు, సేవల కొరకు కేవలం అధికారిక కౌంటర్లలో టికెట్లు మాత్రమే కొనుగోలు చేయాలి. **ఫిర్యాదు చేయండి :** "భక్తులను ఎవరైనా డబ్బులు అడిగి ఇబ్బంది పెడితే, వెంటనే అక్కడ విధుల్లో వున్న అధికారులకు తెలపాలన్నారు.



## ప్రజాబాటలో విద్యుత్ భద్రతపై విస్తృత అవగాహన

హుజూరాబాద్ జూన్ 30 (వాయిస్ టుడే): హుజూరాబాద్ టౌన్ సెక్షన్ పరిధిలో మంగళవారం నిర్వహించిన 'ప్రజాబాట' కార్యక్రమంలో విద్యుత్ భద్రతపై వినియోగదారులు, రైతులకు విస్తృత అవగాహన కల్పించినట్లు కరీంనగర్ డీఈ (టెక్నికల్ అండ్ సేఫ్టీ) ఉపేందర్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో విద్యుత్ భద్రతను మరింత బలోపేతం చేసి, అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే టీజీఎన్‌పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**సిబ్బందికి 'వన్ మినిట్ సేఫ్టీ' తప్పనిసరి..**

ఈ సందర్భంగా డీఈ ఉపేందర్ మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ సిబ్బంది విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగి 'వన్ మినిట్ సేఫ్టీ' సూత్రాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రతి పని ప్రారంభించే ముందు ప్రమాదాలను అంచనా వేసి, అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవడం ద్వారా విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని స్పష్టం చేశారు.

**రైతులు స్వయంగా ఫ్యూజ్‌లు మార్చవద్దు..**

వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వయంగా ఫ్యూజ్‌లు మార్చేందుకు ప్రయత్నించవద్దని డీఈ సూచించారు. విద్యుత్ లైన్లలో సాంకేతిక లోపాలు తలెత్తినప్పుడు వెంటనే 1912 టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారం అందించాలని కోరారు. అలాగే వ్యవసాయ మోటార్లకు అదనపు లోడ్లు వినియోగిస్తున్న రైతులు 5 హెచ్‌పీ నుంచి 7.5 హెచ్‌పీ వరకు ఉన్న అదనపు లోడ్లను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించుకోవాలని పిలుపునిచ్చారు.

**అధికారులకు కీలక ఆదేశాలు..**

విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచడం, ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా అధికారులు పలు చర్యలు చేపట్టాలని డీఈ ఆదేశించారు. పొడవైన విద్యుత్ లైన్ల మధ్య అదనపు స్తంభాలు ఏర్పాటు చేయాలి, దెబ్బతిన్న షార్ట్ పోల్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి, వదులుగా ఉన్న వైర్లను సరిచేయాలి, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ స్తంభాల ప్లింత్‌లను పైకి లేపాలి, వ్యవసాయ మోటార్లకు తప్పనిసరిగా కెపాసిటర్లు అమర్చేలా చూడాలి. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏఈ (ఆపరేషన్), ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో విద్యుత్ వినియోగదారులు, రైతులు పాల్గొన్నారు

## తపస్ ప్రాథమిక సభ్యత్వానికీ రాష్ట్ర పదవికీ రాజీనామా చేసిన శ్రీనివాస్

**తపస్ రాష్ట్ర కమిటీకీ రాజీనామా పత్రం సమర్పించిన రోట్టే శ్రీనివాస్**



ధర్మపురి, జూన్ 30 (వాయిస్ టుడే) : తపస్ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ కార్య వర్గ సభ్య పదవితో పాటు తన ప్రాథమిక సభ్యత్వం నకు రాజీనామా చేసి తన రాజీనామా పత్రం లను తపస్ తెలంగాణ రాష్ట్ర శాఖకు అందజేసినట్టు మంగళవారం రోజు మధ్యాహ్నం వేళలో రోట్టే శ్రీనివాస్ మీడియాకు తెలుపుతూ త్వరలోనే తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తా అని మీడియాకు తెలిపారు. ఇన్ని రోజులుగా తనకు సంఘ భాధ్యతలను అప్పగించి సంఘ భాధ్యతలును నిర్వహించడానికి సహకరించిన తపస్ తెలంగాణ రాష్ట్ర శాఖ కమిటీ సభ్యులతో పాటు, తపస్ కుటుంబ సభ్యులు అందరికి తన హృదయ పూర్వక ధన్యవాదములను తెలియజేశారు.

## దౌల్తాబాద్ బిసి సంక్షేమ వసతి గృహంలో ఇంటర్మీడియట్ చదువుకునే విద్యార్థులకు వసతి సౌకర్యం కలదు



నర్సాపూర్ (వాయిస్ టుడే) : దౌల్తాబాద్ బిసి సంక్షేమ వసతి గృహంలో ఇంటర్మీడియట్ చదువుకునే విద్యార్థులకు వసతి సౌకర్యం కోసం దరఖాస్తులు చేసుకోవాలని నియోజకవర్గం లో హత్నూర మండల పరిధిలో దౌల్తాబాద్ హాస్టల్ వార్డెన్ బద్రి ప్రసాద్ మాట్లాడుతూ దౌల్తాబాద్ బిసి హాస్టల్ను ఇంటర్మీడియట్ చదువుకునే విద్యార్థుల వసతి కోసం మార్చబడిందని ఆయన తెలిపారు. ఈ వసతి గృహంలో ఉండేందుకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ద్వితీయ సంవత్సరంతో పాటు డిగ్రీ, బీకాం , ఐటిఐ చదువుకునే విద్యార్థులు సైతం ఈ వసతి గృహంలో ఉండేందుకు ఉన్నతాధికారులు అవకాశం కల్పించినట్లు తెలిపారు. గతంలో ఐదో తరగతి నుండి పదో తరగతి వరకు హాస్టల్లో ఉండే విద్యార్థులకు ఉండే ఈ హాస్టల్లో ప్రస్తుతం ఇంటర్మీడియట్ పై చదువుకునే విద్యార్థుల వసతి కోసం ప్రభుత్వం మార్చబడిందని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆసక్తిగల విద్యార్థులు ఈ హాస్టల్లో ఉండేందుకు స్వయంగా వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. పూర్తి సమాచారం కోసం ఫోన్ నెంబర్ 7989667072 కు సంప్రదించాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకోవడానికి కావలసిన సర్టిఫికెట్లు: ఆధార్ కార్డు జిరాక్స్, పదో తరగతి మేము, కులం ,ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు, మూడు పాస్ ఫోటో లు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, ప్రస్తుతం చదువుతున్న కళాశాల బోనఫైడ్ జతపరిచి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. https://bchostels. cgg.gov.in/ Index.do ఆన్లైన్లో సైతం దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

## ఎరువుల యాప్‌ను రద్దు చేయాలి: రైతు సంఘం



కృష్ణా జిల్లా–గన్నవరం(వాయిస్ టుడే): ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎరువుల యాప్ వల్ల వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటుందని రైతు సంఘం నాయకుడు బొమ్మారెడ్డి సుబ్బారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం గన్నవరం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో అధికారులకు ఆయన ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త యాప్ విధానం వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సాంకేతిక సమస్యల వల్ల సకాలంలో ఎరువులు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కాబట్టి, తక్షణమే ఈ యాప్‌ను రద్దు చేసి, పాత పద్ధతిలోనే రైతులకు ఎరువులు పంపిణీ చేయాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సూరగాని సాంబశివరావు, ఆవుటపల్లి సాంబయ్య, కే శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**ప్రభుత్వ పాఠశాలలను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్న సర్కార్**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పాఠశాల పూర్వ విద్యార్థి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ లోని పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన తరగతి గదులు ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే.**

**స్కూల్ అభివృద్ధికి రూ. లక్ష విరాళం ప్రకటించిన ఎమ్మెల్యే.**

**క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత, ఉద్యోగ విరమణ పొందుతున్న డీఈఓ, ఉపాధ్యాయుడికి సన్మానం**



సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, జూన్ –30 (వాయిస్ టుడే): విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పాఠశాల పూర్వ విద్యార్థి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్లోని పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నూతన తరగతి గదులను ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై ప్రారంభించారు. జాతీయ స్థాయి ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అందించి అభినందించారు. అలాగే ఉద్యోగ విరమణ పొందుతున్న డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయుడిని సన్మానించి వారి సేవలను కొనియాడారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఈ విద్యాలయంలో అదనపు తరగతి గదులు పూర్తి చేయించామని తెలిపారు. ఈ విద్యాలయంలో బోధన, వసతులపై నమ్మకంతో తల్లిదండ్రులు పిల్లలను అడ్మిషన్ చేస్తున్నారని వివరించారు. 400 కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. పదో తరగతిలో ఈ పాఠశాల నుంచి చాలా మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని వెల్లడించారు. ప్రతి విద్యార్థి తమ నేపథ్యం ఏదైనా తాము ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే తాము అనుకున్న లక్ష్యం చేరుకుంటారని పేర్కొన్నారు. వివిధ ఉద్యోగాలు, స్వయం ఉపాధి, ఇతర రంగాల్లో స్థిరపడిన తర్వాత విద్యార్థులు సమాజానికి సేవ చేయాలని సూచించారు. విద్యార్థి దశలో మొక్కలు నాటాలని, పరిసరాల పరిశుభ్రత పై వివరించాలని, నీటి వృథాను అరికట్టాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

**పాఠశాల అభివృద్ధిపై సీఎం దృష్టికి తీసుకెళ్తా..**

పాఠశాల పూర్వ విద్యార్థి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. పాఠశాల ఎంతో మందికి ధైర్యం ఇచ్చిందని, ఈ బడిలో సీటు రావడం చాలా కష్టంగా ఉండేదని గుర్తు చేశారు .తల్లితండ్రులకు కూడా నమ్మకం ఉందని తెలిపారు. అపుడు తమకు ఎంతో మంది ఉపాధ్యాయుల మార్గదర్శనం, సూచనలతో ఇప్పుడు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డామని పేర్కొన్నారు. వివిధ దేశాలు, ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని వివరించారు. అందరూ సమానమేనని, ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదివి.. ఇప్పుడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యా శాఖ ను తన వద్ద పెట్టుకొని దేశంలో మోడల్ గా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళు తున్నారని వెల్లడించారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారని వెల్లడించారు. బొప్పాపూర్ స్కూల్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. స్కూల్ అభివృద్ధికి రూ. లక్ష విరాళం ప్రకటించారు. పాఠశాల అభివృద్ధిపై పూర్వ విద్యార్థి గా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, సర్పంచ్ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీని అంగడి సరుకులా మార్చొద్దు

**చంద్రబాబు ప్రైవేటీకరణ మోజుతో ప్రభుత్వ బాధ్యతను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారు**

**గన్నవరం ఎంపీపీ, వైఎస్సార్సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగాని రవి**



కృష్ణా జిల్లా–గన్నవరం(వాయిస్ టుడే): రాష్ట్ర ప్రజలకు వెన్నెముకలా నిలిచిన ఆర్టీసీని ప్రైవేటీకరించే ప్రమాదకర నిర్ణయాలతో చంద్రబాబు ప్రభుత్వం ముందుకు వెళ్తోందని గన్నవరం ఎంపీపీ, వైఎస్సార్సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగాని రవి ఆరోపించారు. "ప్రైవేటీకరణ అంటే ప్రభుత్వ బాధ్యతను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడమే. ఈ రోజు ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారు. రేపు లాభదాయక రూట్లను ఇస్తారు. ఎల్లుండి డిపోలు, వర్క్‌షాప్‌లు, ఇతర సేవలను కూడా ప్రైవేట్ చేతుల్లో పెడతారు. చివరకు ఆర్టీసీ పేరు మాత్రమే మిగులుతుంది. ఇదే ప్రైవేటీకరణ కాకపోతే మరేమిటి?" అని ప్రశ్నించారు. "ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడానికి ఉందా? లేక ప్రైవేట్ కంపెనీలకు వ్యాపారం కల్పించడానికి ఉందా? ప్రభుత్వమే నడపాల్సిన ప్రజారవాణా వ్యవస్థను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం ద్వారా ప్రభుత్వం తన రాజ్యాంగబద్ధమైన బాధ్యత నుంచి తప్పుకుంటోంది. ఇది ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైన నిర్ణయం" అని విమర్శించారు. జగన్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తే, ఇప్పుడు అదే సంస్థను క్రమంగా బలహీనపరిచి ప్రైవేట్ కంపెనీలకు అవకాశాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. "ఆర్టీసీకి అనుభవజ్ఞులైన డ్రైవర్లు, మెకానిక్లు, సాంకేతిక సిబ్బంది ఉన్నారు. వేలాది మంది ఉద్యోగులు ఉండగా ప్రైవేట్ కంపెనీల అవసరం ఏమిటి? ప్రభుత్వం బస్సులు కొనుగోలు చేసి, ఆర్టీసీ ఉద్యోగులతోనే నడిపిస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి. కానీ కావాలనే ప్రైవేట్ కంపెనీలకు నిర్వహణ అప్పగించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం చెప్పాలి" అని డిమాండ్ చేశారు.

"చంద్రబాబు గతంలో విద్యుత్, ప్రభుత్వ సేవలు, ఇతర రంగాల్లో ప్రైవేటీకరణకు ప్రాధాన్యం ఇచ్చినట్లే, ఇప్పుడు ఆర్టీసీపై కూడా అదే విధానాన్ని అమలు చేస్తున్నారని ప్రజలు భావిస్తున్నారు. ప్రజల ఆస్తులను, ప్రజల సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ఆలోచనను వెంటనే విరమించుకోవాలి" అని అన్నారు. "ఆర్టీసీ అనేది కేవలం ఒక సంస్థ కాదు. రోజూ లక్షలాది మంది విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, వృద్ధులు ఆధారపడే ప్రజారవాణా వ్యవస్థ. అలాంటి సంస్థను లాభనష్టాల కోణంలో చూసి ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే, భవిష్యత్తులో చార్జీల పెంపు, ఉద్యోగాల కోత, గ్రామీణ ప్రాంతాల్లో సేవల తగ్గుదల వంటి పరిణామాలు వచ్చే ప్రమాదం ఉందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి" అని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, కొత్త బస్సులను ఆర్టీసీయే కొనుగోలు చేసి, ఆర్టీసీ ఉద్యోగులతోనే నడపాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి సంస్థను మరింత బలోపేతం చేయాలని అనగాని రవి డిమాండ్ చేశారు. "లేకపోతే కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు.



## రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి:సూరగాని సాంబశివరావు

**గన్నవరం రైతు నాయకుల పిలుపు**

కృష్ణా జిల్లా–గన్నవరం(వాయిస్ టుడే): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గన్నవరం రైతు సంఘం నాయకులు బుధవారం గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సూరగాని సాంబశివరావు మాట్లాడుతూ, జూలై 3, 4, 5 తేదీలలో ఏలూరు నగరంలో ఈ రాష్ట్ర మహాసభలు అత్యంత వైభవంగా జరగనున్నాయని తెలిపారు. అందులో భాగంగా జూలై 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జూట్ మిల్ సెంటర్ నుండి భారీ 'రైతు, ప్రజా ప్రదర్శన' ప్రారంభమవుతుందని, అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్ గ్రౌండ్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ బహిరంగ సభకు ముఖ్య వక్తలుగా ా×ఖూ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, ా×ఖూ అధ్యక్షులు అశోక్ ధావలే, ాఖవీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. ప్రభాకరరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య, కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. బలరాం తదితరులు హాజరై ప్రసంగిస్తారని అన్నారు. "వ్యవసాయాన్ని కాపాడుకుందాం – రైతును రక్షించుకుందాం" అనే నినాదంతో సాగుతున్న ఈ మహాసభలకు, బహిరంగ సభకు గన్నవరం నియోజకవర్గ పరిధిలోని రైతులు, కౌలు రైతులు, ప్రజాస్వామ్యవాదులు అందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయలని కోరారు. ఈ కార్యక్రమం లో సంఘం నాయకులు కె శ్రీమన్నారాయణ, బొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, ఆవుటపల్లి సాంబయ్య, మిరప నాగేశ్వరావు, రైతు వాణి ఎడిటర్ ఉడతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల నిర్వహణపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం

**జీడబ్ల్యూఎంసీ – ఆస్కీ సంయుక్త ఆధ్వర్యంలో అధికారులకు అవగాహన**

**పాల్గొన్న రాష్ట్రంలోని 15 మున్సిపాలిటీల అధికారులు**

హనుమకొండ జిల్లా, (వాయిస్ టుడే) : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ), అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ) సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్మాణ మరియు కూల్చివేత వ్యర్థాల నిర్వహణ అంశంపై మున్సిపల్ కమిషనర్లు,ఇంజినీర్లు,సంబంధిత అధికారులకు ఒకరోజు నాయకత్వ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి,ఆస్కీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బి.జనార్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

# తడిబట్టలతో భద్రకాళి అమ్మవారి సాక్షిగా ప్రమాణానికి సిద్ధం.. మీరు సిద్ధమా..?

**కుడా భూముల వేలంలో రూ.50 కోట్ల నష్టం**

**వేలాన్ని రద్దు చేసి సీబీఐ లేదా కమిషన్‌తో విచారణ జరపాలి**

**ప్రభుత్వ భూమిలో ప్రజాప్రయోజనాల నిర్మాణాలు చేపట్టాలి**

**హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ నాయకుల డిమాండ్**



హనుమకొండ, (వాయిస్ టుడే) : ఇటీవల కుడా నిర్వహించిన బాలసముద్రం భూముల వేలంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ్ రెడ్డి కాంగ్రెస్ నాయకులకు బహిరంగ సవాల్ విసిరారు. బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్ వెనుక కుడా వేలం వేసిన స్థలం వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జూన్ 21న కుడా 2 ఎకరాల 27 గుంటల భూమిని వేలం వేసిందని,బహిరంగ మార్కెట్‌లో గజానికి సుమారు రూ.1.50 లక్షల విలువ ఉన్న భూమిని కేవలం రూ.66 వేల నుంచి రూ.69 వేల మధ్య ధరలకు విక్రయించడం వెనుక సిండికేట్ వ్యవహారం ఉందని ఆరోపించారు. ఈ కారణంగా కుడా కు సుమారు రూ.50 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు.

**భద్రకాళి అమ్మవారి సాక్షిగా ప్రమాణానికి సవాల్..**

వేలంలో అవినీతి జరగలేదని కాంగ్రెస్ నాయకులు చెబితే శుక్రవారం భద్రకాళి అమ్మవారి ఆలయానికి వచ్చి తడి బట్టలతో అమ్మవారి సాక్షిగా ప్రమాణం చేయాలని బీఆర్ఎస్ నాయకులు సవాల్ విసిరారు. తాము కూడా అదే విధంగా ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వేలంలో పాల్గొనేందుకు వచ్చిన వారిని కొందరు ప్రజా ప్రతినిధుల పేర్లు చెప్పి బెదిరింపులకు గురిచేశారని.. ప్రలోభాలకు గురిచేసి వేలంలో పాల్గొనకుండా చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి అవసరమైతే సీబీఐ దర్యాప్తుకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

**వెంటనే వేలాన్ని రద్దు చేయాలి..**

వివాదాస్పద వేలాన్ని వెంటనే రద్దు చేయాలని..ఆ స్థలంలో ప్రజాప్రయోజనాల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూల్ లేదా ఆదాయం వచ్చే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని సూచించారు. ప్రభుత్వ భూములను కొందరి ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల కోసం వినియోగించాలని డిమాండ్ చేశారు. మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి వ్యతిరేకం కాదని,ప్రభుత్వ స్థలాల విక్రయంలో పారదర్శకత ఉండాలని అన్నారు. బహిరంగ మార్కెట్ విలువ కంటే తక్కువ ధరలకు ప్లాట్లు కేటాయించడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కమిషన్ మాజీ సభ్యులు దర్శన్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ సిరాజుద్దీన్, సీనియర్ నాయకులు నార్లగిరి రమేష్,నయీమొద్దీన్,రామ్మూర్తి, రమేష్, కృష్ణ,వేణు,మాజీ కార్పొరేటర్లు ఉడతల సారంగపాణి,మేకల బాబు రావు,సోదా కిరణ్,సంకు నర్సింగ రావు, నాయకులు పుష్ప, సదాంత్, రాంచందర్, శేఖర్,ఖలీల్, ఇస్మాయిల్, రాజేష్,తక్కళ్లపల్లి వినీల్ రావు,శ్యామ్ రెడ్డి,డా.కంజర్ల మనోజ్ కుమార్,ఫెరోజ్,మహమూద్,గౌస్ ఖాన్,కోటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**